**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily

సంపుటి : 4 | సంచిక :86 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 16 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




# 'వికసిత్ భారత్' వైపు అడుగులు



- ఎర్రకోటపై ఎగిరిన మువ్వన్నెల జెండా
- స్వదేశీ పరిజ్ఞానం, సాంస్కృతిక వైభవంతో సాగిన 80వ స్వాతంత్ర్య వేడుకలు
- ఎర్రకోటపై వరుసగా 13వ సారి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించిన మోదీ
- 105 ఎంఎం లైట్ గన్స్‌తో 21 తుపాకుల వందనం..
- 'వందేమాతరం' ప్రత్యేక ఆలాపన
- సరస్సుల పేర్లతో అతిథుల బ్లాకులు.. 5 వేల మందికి ప్రత్యేక ఆహ్వానం
- సంప్రదాయ దుస్తుల్లో 1,500 మంది కళాకారుల రంగురంగుల సాంస్కృతిక ప్రదర్శనలు

న్యూఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట వేదికగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంబరాన్ని తాకాయి. జాతీయ గేయం 'వందేమాతరం' రూపుదిద్దుకుని 150 ఏళ్లు పూర్తవుతున్న శుభతరుణంలో ఈ ఏడాది వేడుకలు ప్రత్యేక చారిత్రక స్ఫూర్తిని సంతరించుకున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా 13వసారి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి, త్రివిధ దళాలు మరియు ఢిల్లీ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ గీతం 'జనగణమన'తో వివరాలు 2లో..





## వికసిత్ భారత్ సంకల్పంలో ఏపీ పాత్ర

- కాకినాడలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పవన్ కల్యాణ్
- ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి భారత్ ఎదుగుతోందని వ్యాఖ్య
- వికసిత్ భారత్ సంకల్పంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడి
- కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ

కాకినాడ

బలమైన, సమర్థవంతమైన దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కాకినాడలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఒక తరం స్వాతంత్ర్యం కోసం పోరాడితే, మరో తరం దానిని కాపాడిందని గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్' సంకల్పంలో ఏపీ కూడా తనదైన కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని భరోసా ఇచ్చారు. అంతకుముందు పవన్ కల్యాణ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

## జెన్-జీ, జెన్-ఆల్ఫా లేబుళ్లు పాశ్చాత్య ధోరణి



- మన బిడ్డలను కొడుకులు, కూతుళ్లు అని పిలుద్దాం : అసోం సీఎం హిమంత
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన హిమంత బిశ్వ శర్మ
- జెన్-జీ, జెన్-ఆల్ఫా వంటివి యూరోపియన్ సంస్కృతి నుంచి వచ్చాయని వెల్లడి
- యువత పాశ్చాత్య భావనల ప్రభావంలో పడొద్దని హితవు



## శబరిమలలో చింగం మాస పూజల కలకల

- నేడు సాయంత్రం తెరుచుకోనున్న ఆలయ ద్వారాలు
- మలయాళ నూతన సంవత్సరం వేళ అయ్యప్ప స్వామి దివ్య దర్శనం..
- 21 వరకు ప్రత్యేక పూజలు, విస్తృత ఏర్పాట్లు చేసిన దేవస్థానం బోర్డు




## ప్రజాస్వామ్య విలువలకు పునరంకితం కావాలి

- 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్
- ప్రజాస్వామ్య సూత్రాలకు పునరంకితం కావాలని పిలుపు
- స్వాతంత్ర్య సమరయోధుల నుంచి స్ఫూర్తి పొందాలని సూచన
- ఉజ్వల, సమ్మిళిత భారతదేశం కోసం కృషి చేద్దామన్న మాజీ సీఎం

# 2029 నాటికి అందరికీ ఇళ్లు

- మన చేతిలో జాతీయ జెండా ఉండాలి
- గుండెల్లో బలమైన అజెండా ఉండాలి
- రాజధాని అమరావతిలోని రాయపూడి పరేడ్ మైదానంలో తొలిసారిగా స్వాతంత్ర్య వేడుకలు
- జాతీయజెండాను ఎగురవేసిన సీఎం చంద్రబాబు





### వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

- 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమరావతిలో సీఎం చంద్రబాబు ప్రసంగం
- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన కోసం ఐక్యంగా పనిచేద్దామని పిలుపు
- గత పాలనలోని విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తున్నామన్న సీఎం
- రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు, వచ్చే ఏడాది పోలవరం పూర్తిపై హామీ
- వివిధ శాఖల శకటాల ప్రదర్శన, ప్రతిభావంతులైన పోలీసులకు పతకాల ప్రదానం

వివరాలు 2లో..

## 'విశ్వగురు' లక్ష్యానికి శత్రు శక్తుల విఘాతం

- మోహన్ భగవత్ హెచ్చరిక
- స్వాతంత్ర్య పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత
- నాగ్‌పూర్ ఆర్ఎస్ఎస్ కేంద్ర స్థానంలో మువ్వన్నెల పతాకావిష్కరణ..
- స్వేచ్ఛను కాపాడుకోవడమే అసలైన విధి



# వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు మువ్వన్నెల జెండాను ఎగురవేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ఆయన స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. రాష్ట్రాన్ని వికాసం నుంచి వైభవం వైపు, సుస్థిరత నుంచి స్వర్ణాంధ్ర దిశగా నడిపిస్తున్నామని, 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనకు ఐదున్నర కోట్ల మంది ఆంధ్రులు సంకల్పం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

"భారతీయులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. దశాబ్దాల పోరాటం, ఎందరో మహనీయుల త్యాగఫలమే మన స్వాతంత్ర్యం. 80 ఏళ్ల క్రితం మన పెద్దలు కన్న కలలను సాకారం చేసి, 2047 నాటికి దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెడదాం. ఈ దేశానికి మనమేం ఇవ్వగలమని ఆలోచించడమే 'అనే నేను...' సంకల్పం. రాబోయే 20 ఏళ్లు దేశ భవిష్యత్తు కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ప్రధాని మోదీ ఇచ్చిన వికసిత్ భారత్, మనం నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలు వేర్వేరు కావు. ఐక్యంగా ఈ లక్ష్యాలను సాధిద్దాం" అని ముఖ్యమంత్రి ఉద్బోధించారు.

**గత పాలన విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని విధాలా విధ్వంసానికి గురైందని, వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "గత పాలకుల అహంకారం, అవినీతి, అరాచకాలతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునర్నిర్మాణ బాధ్యతను స్వీకరించాం. గత 26 నెలల్లో విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి స్థిరత్వం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాధనే మా లక్ష్యం. ప్రజల మద్దతు, కూటమి ఐక్యత, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి కొత్త ఊపిరి పోశాం" అని తెలిపారు. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ వంటి అన్ని అంశాల్లో కేంద్రం సహకరిస్తోందన్నారు. గత ప్రభుత్వ అప్పులను రీషెడ్యూల్ చేసి రూ.8,269 కోట్లు ఆదా చేశామని, రాష్ట్ర వృద్ధి రేటును 11.3 శాతానికి పెంచామని వివరించారు.

**పెట్టుబడుల వెల్లువ, ఉద్యోగాల కల్పన**

పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం నింపేందుకు 28 కొత్త పారిశ్రామిక విధానాలు తీసుకొచ్చామని సీఎం తెలిపారు. "ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం. ఇప్పటికే రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదరగా, వాటిలో

రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. తద్వారా 11 లక్షల ఉద్యోగాలు వస్తాయి. గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, దాల్మియా సిమెంట్, హీరో, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి తరలివస్తున్నాయి. 36 రోజుల్లోనే ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు అనుమతులిచ్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను నిరూపించాం. యువత గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలు భర్తీ చేశాం. ఇకపై ఏటా డీఎస్సీ ఉంటుంది. ఇప్పటికే 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం" అని సీఎం పేర్కొన్నారు.

**వ్యవసాయం, సాగునీటి రంగాలకు పెద్దపీట**

'అన్నదాత సుఖీభవ' కింద ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు అందిస్తున్నామని, వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీని ప్రవేశపెడుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. "లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం. మదనపల్లెలో త్వరలో హార్టికల్చర్ యూనివర్సిటీకి శ్రీకారం చుడతాం. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తున్నాం. గత 26 నెలల్లో సాగునీటి ప్రాజెక్టులపై రూ.25 వేల కోట్లు ఖర్చు చేశాం. మరో మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశాం. 30 ఏళ్ల కల అయిన వెలిగొండ ఫేజ్-1ను త్వరలో ప్రారంభిస్తున్నాం. వంశధార-నాగావళి అనుసంధానం 73 శాతం పూర్తయింది. వచ్చే ఏడాది పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తాం" అని హామీ ఇచ్చారు.

**అభివృద్ధి, సంక్షేమంలో సమతుల్యత**

రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని సీఎం వివరించారు. రాష్ట్రంలో రూ.64 వేల కోట్ల రైల్వే పనులు, రూ.38 వేల కోట్ల హైవే పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఐదున్నర కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీకగా అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మిస్తామన్నారు. మహిళా సాధికారతకు 'స్వయం బ్రాండ్', పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చామని పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, నకిలీ మద్యంపై ఉక్కుపాదం వంటి చర్యలు తీసుకున్నామన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.30,849 కోట్ల బకాయిలు చెల్లించామని, ప్రజా భద్రతలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని స్పష్టం చేశారు. 'ఈగల్ టాస్క్ ఫోర్స్' ద్వారా గంజాయి, డ్రగ్స్‌ను అణిచివేస్తున్నామని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ఏపీఎస్పీ, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళాలు, ఎన్‌సీసీ, స్కౌట్స్ విద్యార్థులు నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో సాధించిన ప్రగతిని వివరిస్తూ వివిధ ప్రభుత్వ శాఖలు ప్రదర్శించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు పోలీసు అధికారులకు, సిబ్బందికి ముఖ్యమంత్రి పతకాలను ప్రదానం చేశారు.

## ప్రజాస్వామ్య విలువలకు పునరంకితం కావాలి: వైఎస్ జగన్

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశ ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఉదయం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఆయన తన సందేశాన్ని పంచుకున్నారు. దేశ నిర్మాణానికి మూలస్తంభాలైన ప్రజాస్వామ్య సూత్రాలకు మనమందరం పునరంకితం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు."ఈ 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేళ, మన గొప్ప దేశాన్ని నిర్మిస్తున్న ప్రజాస్వామ్య విలువలకు మనల్ని మనం పునరంకితం చేసుకుందాం. స్వాతంత్ర్య సమరయోధుల పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని, ఉజ్వలమైన, సమ్మిళితమైన, సుసంపన్నమైన భారతదేశం కోసం మనమందరం కృషి చేయాలి" అని జగన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, దేశ భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు. 'జై హింద్' అంటూ తన సందేశాన్ని ముగించారు.

# సప్తధార.. భారత్ అభివృద్ధికి మోదీ మాస్టర్‌ప్లాన్ ఇదే



**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ భవిష్యత్ అభివృద్ధికి కీలకమైన ఏడు రంగాలను 'శక్తి సప్తధార'గా అభివర్ణించారు. దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చడంతో పాటు అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ఈ ఏడు శక్తులను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ.. తయారీ రంగం, రైతులు, సాంకేతికత, గతిశక్తి, రక్షణశక్తి, హరిత ఇంధనం, సాఫ్ట్ పవర్‌ను భారత్ బలాలుగా పేర్కొన్నారు. ఈ రంగాల్లో వేగంగా ముందుకు సాగితే దేశ వృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని చెప్పారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త నినాదాన్ని అందించారు. సప్తధార శక్తి పేరుతో ఆయా రంగాలకు, వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రకటించారు. ముఖ్యంగా యువతరానికి ఇచ్చే ప్రయార్టీని మోదీ పదే పదే హైలైట్ చేశారు. జెన్‌జీ ఉద్యమాల నేపథ్యంలో వారి విషయాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే తన సంకల్పాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే సంకల్పం, దేశ ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ సంకల్పం ప్రపంచం భారతదేశాన్ని భిన్నంగా చూసేలా చేసిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.ఈ రోజు భారత్ ఒక గొప్ప కలను కంటోంది. కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని పూర్తి సంకల్పంతో కలలు కంటోంది. ఆ కల ఏమిటంటే, 2047లో భారతదేశం తన స్వాతంత్ర్యానికి 100 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు, మనం కచ్చితంగా 'అభివృద్ధి చెందిన భారత్‌ను ' నిర్మించి, దానిని సాకారం చేస్తాం.140 కోట్ల మంది పౌరుల కృషి, ప్రయత్నాల ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలని సంకల్పించినప్పుడు, అది యావత్ ప్రపంచం ముందు భారత్ ధైర్యానికి నిదర్శనంగా నిలుస్తుందని, భారత్‌పై ప్రపంచ దృక్పథాన్ని మార్చుకునేలా చేస్తుందని ప్రధానమంత్రి అన్నారు.భారత్ కలలు, సంకల్పం గొప్పగా ఉండాలని, ఎందుకంటే గొప్ప లక్ష్యాలు దేశ సామర్థ్యాలను కొత్త శిఖరాలకు చేర్చడంలో సహాయపడతాయని ప్రధాని మోదీ అన్నారు. "మన కలలు, సంకల్పం గొప్పగా ఉండాలి, ఎందుకంటే అవి మన సామర్థ్యాలను కొత్త శిఖరాలకు చేర్చడంలో సహాయపడతాయి" అని ఆయన అన్నారు. 12 ఏళ్లలో దేశంలో జరిగిన మార్పులను, వివిధ రంగాల్లో పెరిగిన ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ కాలంలో రక్షణ రంగ ఉత్పత్తి దాదాపు నాలుగు రెట్లు పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీ దాదాపు ఏడు రెట్లు, ఆధునిక రైల్వే కోచ్‌ల ఉత్పత్తి 21 రెట్లు, మొబైల్ ఫోన్ల తయారీ 33 రెట్లు పెరిగాయని తెలిపారు. ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య, అలాగే పేటెంట్ల సంఖ్య కూడా దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ప్రధానమంత్రి ప్రకారం, డిజిటల్ లావాదేవీలు దాదాపు 100 రెట్లు పెరిగాయి.25 కోట్ల మంది పౌరులు పేదరికాన్ని అధిగమించి దాని నుంచి బయటపడ్డారు. ఒకప్పుడు మనల్ని 'ఫ్రాజైల్ 5' (అతి బలహీనమైన ఐదు దేశాలు)లో ఒకటిగా పరిగణించేవారు. నేడు, మనం ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా పరిగణిస్తున్నారు. 2014 నాటికి, ప్రపంచం మనల్ని 'ఫ్రాజైల్ 5' జాబితాలో బంధించింది. గత 12 సంవత్సరాలుగా, మనం వేగంగా పురోగమిస్తున్నాం.ఇరాన్-అమెరికా ఉద్రిక్తతను ప్రస్తావిస్తూ, ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి తాము సన్నాహాలు చేశామని, అవి ఫలించాయని అన్నారు. ఇంధన భద్రత ప్రస్తుత అవసరమని ప్రధాని మోదీ అన్నారు. "ఇంధనం లేకుండా ఈ నూతన ప్రపంచంలో ముందుకు సాగడం కష్టంగా మారింది. మనకు భారీ మొత్తంలో ఇంధనం అవసరం. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్‌ను లక్ష్యంగా నిర్దేశించుకున్నాం."పెట్రోల్, డీజిల్, ఎరువులను ఆయుధాలుగా వాడుతున్నారని ప్రధాని మోదీ అన్నారు. చమురు, గ్యాస్ పేరిట ప్రజలను భయపెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో మనం ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొన్నామని ప్రధాని మోదీ అన్నారు. కరోనావైరస్ కారణంగా అన్ని వ్యవస్థలు కుప్పకూలాయి. ఉక్రెయిన్ నుంచి పశ్చిమ ఆసియా వరకు... ప్రతిచోటా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. కానీ భారత్ సన్నాహాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. మనం మన బలాలపై నిలబడి ముందుకు సాగుతున్నాం. ఎర్రకోట ప్రాంగణం నుంచి ప్రధాని మోదీ, జెన్ జెడ్, జెన్ ఆల్ఫా తరాలకు ఒక ముఖ్యమైన కానుకను ప్రకటించారు. ఏడాదిలోగా కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తానని ఆయన తెలిపారు. విద్యార్థులకు ఉచిత కోచింగ్‌ను కూడా ఆయన ప్రకటించారు. "అభివృద్ధి చెందిన దేశంగా భారత్ సాగించే ప్రయాణంలో యువత పోషించాల్సిన పాత్ర చాలా పెద్దది. ఈ రోజు, ఎర్రకోట ప్రాంగణం నుంచి నేను దేశ యువతకు ఒక ప్రకటన చేయాలనుకుంటున్నాను. రాబోయే సంవత్సరంలో 10 మిలియన్ల యువతకు ఏఐ నైపుణ్యాల శిక్షణను అందించాలని సంకల్పించాము, తద్వారా మన దేశ యువత ఏఐ రంగంలో ప్రపంచానికి నాయకత్వం వహించే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు," అని ఆయన అన్నారు. =

## 'ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నక్సల్స్ అంటారా? ఎలా ముద్ర వేస్తారు?'

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో చేసిన 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తీవ్రంగా స్పందించింది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న చదువుకున్న యువతను కేవలం తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారనే కారణంతో 'నక్సల్స్'గా ముద్ర వేయడం సరికాదని సీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ అన్నారు. ప్రధాని వ్యాఖ్యలు అహంకారానికి, సమస్యలను పరిష్కరించడంలో అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ ప్రసంగించారు. సాయుధ నక్సలిజం ముప్పు దాదాపు అంతమయ్యే దశకు చేరుకుందని చెప్పారు. అయితే దేశంలో హింస, అశాంతిని సృష్టించేందుకు అవకాశాల కోసం చూస్తున్న 'దిమాగీ నక్సల్స్' కూడా ఉన్నారని పేర్కొన్నారు. అలాంటి ఆలోచనా ధోరణి ఉన్నవారిని గుర్తించి, ఒంటరిగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువతను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఆ వ్యాఖ్యలపైనే సౌరవ్ దాస్ ఘాటుగా స్పందించారు. 'దిమాగీ నక్సల్స్ లేదా మరేదైనా పదజాలం పనిచేయదు ప్రధాని. చదువుకున్న యువతను ఇలా నక్సల్స్ అని ఎలా తేలిగ్గా ముద్ర వేస్తారు? మీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారనే కారణంతోనే ఇలా అంటారా?' అని ప్రశ్నించారు. ఇది తీవ్ర అహంకారానికి, యువత సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర అసమర్థతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. 'గంటలు మోగుతున్నాయి. మేల్కొలుపు మొదలైంది' అని సౌరవ్ దాస్ అన్నారు. దేశంలో యువత తమ హక్కులు, సమస్యలు, భవిష్యత్తు గురించి ప్రశ్నించడం ప్రారంభించిందని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు.

## 'వికసిత్ భారత్' వైపు అడుగులు..

-మొదటిపేజీ తరువాయి

పాటు తొలిసారిగా 'వందేమాతరం' ఆలాపనతో వేడుకలు ప్రారంభం కావడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

**స్వదేశీ సాంకేతికత.. త్రివిధ దళాల వందనం**

జెండా ఆవిష్కరణ అనంతరం కెప్టెన్ సోనియా చౌహాన్ నేతృత్వంలో త్రివర్ణ పతాకానికి త్రివిధ దళాలు వందనం సమర్పించాయి. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 105 ఎంఎం లైట్ గన్స్ నుంచి 21 తుపాకుల నినాదం మారుమోగింది. ఈ క్రమంలో ఆర్మీ బ్యాండ్ వందేమాతర గీతాన్ని ఆలపించగా, ఎంఐ-17 హెలికాప్టర్లు ఆకాశం నుంచి పూలవాన కురిపించాయి.

**జ్ఞానపథంలో వర్ణరంజిత దృశ్యం**

ఎర్రకోట ప్రాంగణంలోని జ్ఞానపథ్‌లో సుమారు 2,500 మంది ఎన్సీసీ కెడెట్లు, 'మై భారత్' వలంటీర్లు ప్రత్యేక వరుసల్లో కూర్చొని ఆకాశం నుంచి చూస్తే స్పష్టంగా కనిపించేలా 'వందేమాతరం' ఆకృతిని ప్రదర్శించారు. 'వికసిత్ భారత్ 2047' దృక్పథాన్ని చాటిచెప్పేలా ఈ ప్రదర్శన సాగింది.

**ప్రజా భాగస్వామ్యం -- ప్రత్యేక ఏర్పాట్లు..**

మహిళా పారిశ్రామికవేత్తలు, రైతులు, పారిశుధ్య కార్మికులు, శాస్త్రవేత్తలతో సహా దాదాపు 5,000 మంది ప్రత్యేక అతిథులు ఈ వేడుకలకు హాజరయ్యారు. అతిథుల బ్లాకులకు చిల్కా, పుష్కర్, ఫులర్ వంటి దేశంలోని ప్రముఖ సరస్సుల పేర్లు పెట్టారు. వేడుకలు ముగిసిన వెంటనే ఎన్సీసీ కెడెట్లు ఎర్రకోట పరిసరాల్లో 'స్వచ్ఛతా అభియాన్' నిర్వహించి పారిశుధ్య సందేశాన్ని చాటారు.

## జెన్-జీ, జెన్-ఆల్ఫా లేబుళ్లు పాశ్చాత్య ధోరణి

**అసోం :** నేటి యువతను 'జెన్-జీ' లేదా 'జెన్-ఆల్ఫా' అంటూ విదేశీ పదాలతో సంబోధించడంపై అసోం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గౌహతి మాట్లాడిన ఆయన, ఇలాంటి వర్గీకరణలు యూరోపియన్ సంస్కృతి నుంచి వచ్చినవని తెలిపారు. మన సమాజంలో పిల్లలను ప్రేమగా 'కొడుకులు, కూతుళ్లు' అని పిలుచుకోవడమే మన భారతీయ సంస్కృతికి, గుర్తింపునకు నిజమైన ప్రతీక అని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువత సంక్షేమం, వారి నైపుణ్యాలను మెరుగుపరచడం కోసం ఒక ప్రత్యేక 'యువజన అభివృద్ధి, సాధికారత శాఖ'ను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వెల్లడించారు. మన యువత పాశ్చాత్య భావనల ప్రభావంలో పడకుండా, అసోం సొంత సంస్కృతి, గొప్ప చరిత్ర నుంచి ప్రేరణ పొందుతూ స్వయంసమృద్ధి కలిగిన రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

ఈ ప్రసంగంలో సీఎం హిమంత బిశ్వ శర్మ మరికొన్ని సంచలన ప్రకటనలు కూడా చేశారు. రాష్ట్రంలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు నవంబర్ 1వ తేదీ నుంచి నెల రోజుల పాటు పోలీసులు ప్రత్యేక కార్యాచరణ చేపడతారని స్పష్టం చేశారు. అలాగే 2026 నుంచి 2031 మధ్య కాలంలో అసోం మౌలిక వసతుల రంగాన్ని భారీగా ఆధునీకీకరించేందుకు రూ. 1.5 లక్షల కోట్ల నిధులను కేటాయించనున్నట్లు ప్రకటించారు. పాలనా సౌలభ్యం కోసం 8 కొత్త సబ్-డిస్ట్రిక్ట్‌ల ఏర్పాటుతో పాటు, ప్రభుత్వ ఉద్యోగి తన మొదటి భార్యకు న్యాయబద్ధంగా విడాకులు ఇవ్వకుండా వదిలేస్తే, అతని నెలవారీ జీతంలో 50 శాతం మొత్తాన్ని నేరుగా ఆ భార్యకే అందజేసేలా చట్టపరమైన నిబంధనలు తీసురానున్నట్లు వెల్లడించారు.

## శబరిమలలో చింగం మాస పూజల కలకల

**శబరిమల :** కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం పవిత్ర 'చింగం' మాస పూజలు, మలయాళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని నేటి సాయంత్రం 5 గంటలకు పునఃప్రారంభం కానుంది. ఆలయ ముఖ్య తంత్రి కందరారు బ్రహ్మదత్తన్ సమక్షంలో ప్రధాన పూజారి (మేల్‌శాంతి) ప్రసాద్ ఈడీ గర్భగుడి తలుపులను తెరిచి దీపారాధనతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు.

**ముఖ్యమైన విశేషాలు:**

దివ్య దర్శనం: మలయాళ నూతన సంవత్సర ఆరంభ దినమైన ఆగస్టు 17న ఉదయం 5 గంటల నుంచి భక్తులకు స్వామి వారి దివ్య దర్శనానికి అనుమతిస్తారు. పూజల వ్యవధి: ఆగస్టు 21వ తేదీ రాత్రి 10 గంటల వరకు ఈ ప్రత్యేక పూజలు కొనసాగుతాయి. అనంతరం ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తారు. ఓనం ఉత్సవాలు: తిరిగి ఓనం పండుగ వేడుకల సందర్భంగా ఆగస్టు 24న శబరిమల ఆలయ ద్వారాలను మళ్లీ తెరుస్తామని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ప్రకటించింది.

**భక్తులకు విస్తృత ఏర్పాట్లు:**

పుణ్యక్షేత్రానికి తరలివచ్చే అయ్యప్ప భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, కేరళ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. రవాణా సౌకర్యం: నిలక్కల్ నుంచి పంబ బేస్ క్యాంప్‌కు భక్తులను చేరవేసేందుకు వీలుగా కేరళ ఆర్టీసీ 24 గంటల పాటు నిరంతర షటిల్ బస్సు సేవలను అందుబాటులో ఉంచింది. వర్చువల్ క్యూ: యాత్రకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ముందుగానే 'శబరిమల ఆన్‌లైన్ పోర్టల్' ద్వారా వర్చువల్ క్యూ స్లాట్లను బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## 'విశ్వగురు' లక్ష్యానికి శత్రు శక్తుల విఘాతం



**నాగ్‌పూర్ :** భారత్‌ను ప్రపంచానికి దిశానిర్దేశం చేసే 'విశ్వగురు'గా నిలిపేందుకు దేశమంతా శ్రమిస్తుంటే, ఆ మహా లక్ష్యానికి విఘాతం కలిగించేందుకు కొన్ని శక్తులు కుట్రపూరితంగా పనిచేస్తున్నాయని ఆర్‌ఎస్‌ఎస్ (ూూ) సరసంఘచాలక్ మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నాగ్‌పూర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రసంగించారు. 1857 నుంచి దాదాపు 90 ఏళ్ల పాటు అనేక మంది వీరులు చేసిన అపార త్యాగాల ఫలితంగానే మనకు స్వేచ్ఛ లభించిందని మోహన్ భగవత్ గుర్తుచేశారు. "స్వాతంత్ర్యం సాధించడం ఎంత ముఖ్యమో, దానిని నిలబెట్టుకోవడం కూడా అంతే ముఖ్యం. ఎన్ని సవాళ్లు ఎదురైనా దేశ ప్రాథమిక సిద్ధాంతాలను వీడకుండా ముందుకు సాగాలి" అని ఆయన స్పష్టం చేశారు.

**మువ్వన్నెల సందేశం - మహోన్నత ఆదర్శం**

కాషాయం: కార్యాచరణ, సత్జ్ఞానం మరియు త్యాగానికి ప్రతీక.
తెలుపు: ఆంతరంగిక స్వచ్ఛత, సమాజంలో క్రమశిక్షణకు నిదర్శనం.
ఆకుపచ్చ: నిరంతర అభివృద్ధి, సంపద మరియు సమృద్ధికి చిహ్నం.

**భిన్నత్వంలో ఐక్యతే భారత్ బలం**

దేశంలో ప్రజల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమని, ఆ వైవిధ్యమే మన సమగ్రతకు నిదర్శనమని భగవత్ అన్నారు. జాతీయ జెండాలోని అశోక చక్రంలోని ఆకులన్నీ ఒకే కేంద్ర బిందువు నుంచి ఉద్భవించినట్లే, విభిన్న ఆలోచనలు ఉన్నా భారతీయులంతా ఒకే ధర్మం, క్రమశిక్షణ పరిధిలో కలిసికట్టుగా ఉంటారని వివరించారు. భారత్ సంతోషకరమైన, సంపన్నమైన, సురక్షితమైన దేశంగా రూపుదిద్దుకొని మానవాళి శ్రేయస్సుకు దోహదపడాలని, ఆ దిశగా ప్రతి పౌరుడు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# స్త్రీ శక్తి పథకంతో మహిళలకు ఆత్మగౌరవం మంత్రి సవిత.

- మహిళల సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యం.
- మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీ శక్తి తోడ్పాటు.
- పుట్టపర్తి నుంచి కదిరికి ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మంత్రి సవిత.

**కదిరి, పెన్ సత్తా, ఆగస్ట్ 15:** మహిళలకు ఆర్థిక భారం తగ్గించి, ఆత్మగౌరవంతో స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశం కల్పించడమే స్త్రీ శక్తి పథకం లక్ష్యం మని, ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది అని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత అన్నారు. పుట్టపర్తి నుంచి కదిరికి ఆర్టీసీ బస్సులో మహిళలతో కలిసి ప్రయాణించిన అనంతరం కదిరిలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూల నాగరాజు తో కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సవిత మాట్లాడారు. ఈ సందర్భంగా స్త్రీ శక్తి పథకం ఏడాది పూర్తయిన సందర్భంగా మహిళలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. మంత్రి సవిత మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం మహిళల జీవితాల్లో ఎంతో మార్పు తీసుకొచ్చింది. గతంలో బస్సు చార్జీల భారం కారణంగా అవసర మైన పనుల కోసం బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడిన మహిళలు ఇప్పుడు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఉద్యోగాలు, విద్య, వైద్యం, మార్కెట్లు, కుటుంబ అవసరాలతో పాటు దేవాలయాలకు వెళ్లేందుకు కూడా మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు అని తెలిపారు. ఒక మహిళకు నెలకు సుమారు రూ.3 వేల వరకు ప్రయాణ ఖర్చు ఆదా అవుతోంది. ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకునే అవకాశం కలుగుతోంది. మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. "దీపం--1, దీపం--2 వంటి పథకాలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తల్లికి వందనం వంటి పథకాల ద్వారా కూడా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా అర్హత ఉన్న తల్లులకు తల్లికి వందనం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది అన్నారు. స్త్రీ శక్తి పథకానికి రాష్ట్ర వ్యాప్తంగా మహిళల నుంచి మంచి స్పందన లభిస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మంది మహిళలు స్త్రీ శక్తి పథకాన్ని వినియోగించుకున్నారు.





ఏడాది కాలంలో ప్రభుత్వం సుమారు రూ.3,095 కోట్లను ఈ పథకం కోసం ఖర్చు చేసింది. గత ప్రభుత్వం ఆర్టీసీ చార్జీలు తొమ్మిది సార్లు పెంచిందని గుర్తు చేశారు.మహిళల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందమే స్త్రీశక్తి పథకం విజయానికి నిదర్శనం. మహిళల కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. మహిళల సంక్షేమం, సాధికారత కోసం రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను అమలు చేస్తాం అని మంత్రి సవిత స్పష్టం చేశారు.
అంతకు ముందు పుట్టపర్తి నుంచి కదిరికి మంత్రి సవిత మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ప్రయాణంలో మహిళలతో ముచ్చటించి, స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం ద్వారా వారికి కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొన్న గణబాబు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్న ఎమ్మెల్యే గణబాబు.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 15:** 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విశాఖపశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన పలు అధికారిక, సామాజిక కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధి లోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులు, సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. దేశ ప్రగతిలో యువత పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



ప్రజలందరి సహకారంతో పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని స్పష్టం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు, కవాతు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, స్థానిక ప్రముఖులకు ఆయన అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమాల్లో ఎమ్మార్వో లు, జోనల్ కమిషనర్, ప్రభుత్వ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ం

# ఎన్టీఆర్ స్టేడియంలో అత్యంత వైభవంగా 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.





**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 15:** స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం ఉదయం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా పరేడ్ కమాండర్ పరేడ్ ప్రక్రియను రాష్ట్ర హోం శాఖామాత్యులు అనుమతి తో ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర హోం వ్యవహారాలు, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. అనకాపల్లి కేవలం జిల్లా కాదు పోరాటాల గడ్డ అని, అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి, గురజాడ అప్పారావు సామాజిక చైతన్యం అనకాపల్లి గడ్డ ప్రత్యేకతని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని తెలియజేస్తూ, స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న స్వేచ్ఛాయుత, సమృద్ధి, శాంతియుత భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పేర్కొంటూ, ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలియజేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.
ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, పోలీస్ సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా, జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మా పటేల్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతబాబు, మళ్లసురేంద్ర, కొట్ని బాలాజీ, భాగస్వామ్యమయ్యారు.
ఈ సందర్భంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు, ఈ విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం 560 మంది కి ప్రశంసా పత్రాలను అందజేశారు.
ఈ వేడుకలలో జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## కలెక్టరేట్లో ఘనంగా 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.

జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించిన కలెక్టర్ అభిషిక్త్ కిశోర్.



**విశాఖపట్టణం, పెన్ సత్తా, ఆగస్టు 15:** 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లా కలెక్టరేట్లో శనివారం ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులకు చాక్లెట్లు పింపిణీ చేశారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆర్డీవో దీలిప్ చక్రవర్తి మహాత్మా గాంధీ కి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఎస్.డి.సి. మధుసూధన్ రావు, డీఎస్వో భాస్కరరావు, ఏవో బీవీ రాణి, సెక్షన్ల సూపరింటెండెంట్లు శ్యామ్, ఆనంద్, ఇతర అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే క్యాంపు కార్యాలయంలో, ఆఫీసర్స్ క్లబ్ లో జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. అక్కడి ఉద్యోగులకు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# టీడీపీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.

**గుంటూరు, పెన్ సత్తా, ఆగస్ట్ 15:**80 స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించు కొని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే మహమ్మద్ నశీర్ అహ్మద్, టిడిపి జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు తో కలిసి జాతీయ జెండాను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ
గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్, భారతదేశ ప్రజలకు 80 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. లక్షలాదిమంది స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణ త్యాగాలకు నిదర్శనం మన భారతదేశం అన్నారు. 80 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో మన దేశం ఎంతో ముందుకు వెళ్ళింది. ఎక్స్పోర్ట్స్, డిఫెన్స్, ఎయిర్ ఫోర్స్ వంటి ఎన్నో రంగాలలో అధునాతన విధంగా మన భారతదేశ ముందుకు వెళుతుందన్నారు. యువత, మహిళలు, రైతులు అందరూ తమ సంకల్పాన్ని భారతదేశ అభ్యున్నతికి ఉపయోగించాలి, ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందాలన్నారు. అందరికీ మరొక్కసారి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పోతినేని శ్రీనివాసరావు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్, మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మేని, టిడిపి నాయకులు ముత్తినేని రాజేష్, వేములపల్లి శివరామకృష్ణ ప్రసాద్ (బుజ్జి), చిట్టాబత్తిన చిట్టిబాబు, నిమ్మల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతి నికేతన్ లో స్వతంత్ర దినోత్సవ వేడుకలు

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్ట్ 15:**స్థానిక ప్రశాంతి నికేతన్, ఎం.వి .వి. ఎస్. మూర్తి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండంట్ డి .వి. శ్రీనివాస రావు మాట్లాడుతూ ఎందరో దేశభక్తుల త్యాగఫలం గా మన దేశం స్వతంత్ర దేశం గా ఆవిర్భవించినదని, దీనిని మనం భాద్యత యుతంగా క్రమ శిక్షణ తో కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశం భక్తి గీతాలను ఆలపించి, దేశ భక్తుల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ డి . శ్రీనివాస రావు, హెడ్ మిస్ట్రెస్ బాల కుమారి, ఉపాధ్యాయ కార్యాలయ సిబ్బంధి పాల్గున్నారు.



# మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.



**పరవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 15:** 80 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరవాడ మండల ఎంపీపీ పయిల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. వారి త్యాగాలు, పోరాటాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా వాయువులను పీలుస్తూ, ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛగా జీవిస్తున్నామని పేర్కొన్నారు.
దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం కేవలం జాతీయ పండుగ మాత్రమే కాదని, దేశం పట్ల మన బాధ్యతలను గుర్తు చేసే పవిత్రమైన రోజని ఆమె అన్నారు. దేశ అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్య, ఆరోగ్యం వంటి అంశాల పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే నిజమైన ప్రజాసేవ అని పేర్కొన్నారు. యువత దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని, వారు విద్య, క్రీడలు, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో ముందుకు సాగుతూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేస్తూ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చుక్క రాము నాయుడు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొని జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు.

# ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన మంత్రి అనగాని, ఎంపీ భరత్





**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 15:** విశాఖ జిల్లా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం విశాఖపట్నం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, కమిషనర్ ఆఫ్ పోలీస్ శంఖ బ్రత భాగ్చి, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా అధికారులు, పోలీసు శాఖ అధికారులు, ఏపీఎస్ఆర్టీసీ అధికారుల సమక్షంలో విశాఖ జిల్లాకు నూతనంగా వచ్చిన రెండు ఎలక్ట్రిక్ బస్సులను, రెవెన్యూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ ప్రారంభించారు.
అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎలక్ట్రిక్ బస్సులను అతి త్వరగా అందుబాటు లోకి తీసుకువచ్చినందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ ఏపీఎస్ఆర్టీసీ అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టు 15 న విశాఖ జిల్లాలో శక్తి పథకాన్ని ప్రారంభించడం జరిగిందని, ఇప్పటివరకు విశాఖ జిల్లాలో సుమారు రూ.230 కోట్ల విలువైన ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మహిళలకు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రం లోనే అత్యధిక సంఖ్యలో మహిళా ప్రయాణికులు విశాఖ జిల్లాలో ఆర్టీసీ సేవలను వినియోగించుకుంటున్నారని, వారి ప్రయాణ శాతం గణనీయంగా పెరగడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా రీజినల్ మేనేజర్ బి.అప్పల నాయుడు తో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బందిని అభినందించారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికుల సౌకర్యార్థం మొత్తం 20 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో 10 బస్సులు గాజువాక నుంచి ఎన్ఏడి --మద్దిలపాలెం హైవే మీదుగా, మరో 10 బస్సులు సంధ్య థియేటర్, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, ఐటీ పార్క్ తదితర ప్రాంతాల మీదుగా నడుస్తున్నాయని తెలిపారు. గాజువాక నుంచి, విమానాశ్రయం నుంచి కూడా ప్రతి గంటకు బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని వివరించారు. విమానాశ్రయానికి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రూ.300, గాజువాక నుంచి రూ.400 మాత్రమే ఛార్జీగా నిర్ణయించామని, ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ శ్రీభరత్ కోరారు. అనంతరం ప్రారంభించిన ఎలక్ట్రిక్ బస్సుల్లో మంత్రి, ఎంపీ శ్రీభరత్, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, కమిషనర్ ఆఫ్ పోలీస్ శంఖ బ్రత భాగ్చి, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, ఆర్టీసీ అధికారులు ప్రయాణించి పోలీస్ గ్రౌండ్స్ నుంచి ఆర్కే బీచ్ వరకు బస్సు ప్రయాణాన్ని నిర్వహించారు.
పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ బస్సులు విశాఖ నగర ప్రజలకు, అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ప్రయాణికులకు మరింత సౌకర్యవంత మైన, చౌకైన ప్రజా రవాణా సేవలను అందించనున్నాయని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.



# అంజుమన్ ఇత్తెహాద్-ఏ-మిల్లత్ దీని మదరసా నూతన ప్రాంగణం ప్రారంభం.

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభం.






**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 15:** ఫెర్రీ రోడ్ లోని హాజీ అబూసరంగ్ ఈద్గా సమీపంలో 1962 లో స్థాపించబడిన అంజుమన్ ఇత్తెహాద్-ఏ-మిల్లత్ దీని మదరసా నూతన ప్రాంగణాన్ని విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా నూతన మదరసా ప్రాంగణం వెలుపల జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం డా. మహమ్మద్ సాదిక్ తో కలిసి ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తదుపరి రిబ్బన్ కట్ చేసి నూతన మదరసా ప్రాంగణాన్ని ప్రారంభించారు. అల్లాహ్ ఆశీస్సులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, డా. మహమ్మద్ సాదిక్ మదరసా స్థాపక సభ్యులతో కలిసి నూతన ప్రాంగణం లోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా డా. మహమ్మద్ సా...

# వీఎంఆర్డీఏలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 15:** వీఎంఆర్డీఏ కార్యాలయంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం సిరిపురం దరి వీఎంఆర్డీఏ కార్యాలయంలో వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ పాల్గొని ముందుగా మహాత్మాగాంధీ, నెహ్రూ, అంబేద్కర్‌ల చిత్రపటాలకు పూలమాలంకరణ చేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఈ రోజు ఇంత సురక్షిత జీవనం సాగిస్తున్నాం అంటే, ఎందరో మహనీయుల ప్రాణత్యాగాలు, పోరాటాలు, దేశభక్తి, అంకితభావం ఫలితమే అని. వారి త్యాగాలను స్మరించుకోవడం, వారి ఆశయాలకు అనుగుణంగా దేశాభివృద్ధికి మన వంతు కృషి చేయడం భారతీయులుగా మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశకత్వంలో విశాఖపట్నం మహానగర ప్రాంతం సమగ్రంగా, సుస్థిరంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చెందేలా వీఎంఆర్డీఏ నిరంతరం కృషి చేస్తోందని, అలానే గ్రామీణ ప్రాంతాలను పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు నిదులు కేటాయించటం జరుగుతుందన్నారు. ఈ లక్ష్య సాధనలో సంస్థ అధికారులు, ఉద్యోగులు మరియు సిబ్బంది అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు, పారదర్శక మైన సేవలు అందించేందుకు మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. వీఎంఆర్డీఏ ద్వారా ఇటీవల అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అనుకున్న సమయంలో వాటిని పూర్తి చేసి విశాఖ అభివృద్ధి పట్ల మన యొక్క నిబద్ధతను చాటామని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టబోతున్నామని పేర్కొన్నారు. మన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సహకారం అత్యంత కీలకమని, స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, సమర్థవంత మైన వనరుల వినియోగం, బాధ్యతాయుత మైన పౌర జీవనం ద్వారా మన నగరం మరింత సుందరంగా, సురక్షితంగా, అభివృద్ధి చెందిన ప్రాంతంగా రూపుదిద్దుకునేలా ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలని కోరారు. మన దేశ ఐక్యత, సమగ్రత, శాంతి, సౌభ్రాతృత్వం, అభివృద్ధి కోసం అంతా కలిసికట్టుగా ముందుకు సాగుదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, కార్యదర్శి మురళీకృష్ణ, ఒ.ఎస్.డి. కృష్ణానాయక్, ఎస్టేట్ అధికారి దయానిధి, ప్రధాన గణాంకధికారి ఋషిబాబు, పర్యవేక్షక ఇంజనీర్లు మధుసూదన రావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి కి వైభవంగా మకర తోరణం అలంకరణ.







- ముఖ్య అతిథిగా మాడుగుల ఎమ్మెల్యే బండారు.
- మకర తోరణాన్ని బహుకరించిన పయిల చిన అక్కు నాయుడు.

**పరవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 15:** మండల కేంద్రం పరవాడ సంత బయలులో గల ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం మకరతోరణం అలంకరణ మహోత్సవం అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక శోభ నడుమ నిర్వహించబడింది. సూర్యోదయ వేళ నుంచే ఆలయ ప్రాంగణం వేద మంత్రోచ్చారణలు, శ్రీరామ నామస్మరణలతో మారు మ్రోగింది.

మండల తెలుగు యువత అధ్యక్షుడు పయిల చిన అక్కు నాయుడు అందించిన ఆర్థిక సహకారంతో స్వామివారికి ఈ దివ్య మకర తోరణాన్ని సమర్పించారు. ప్రముఖ వేద పండితులు అందుకూరి రత్నకుమార్ పర్యవేక్షణలో ఉదయం 6 గంటల నుంచి శాస్త్రోక్త పూజలు ప్రారంభమయ్యాయి. విశ్వశ్రేయస్సును కాంక్షిస్తూ ముందుగా మకర తోరణానికి పంచామృతాలతో చిన అక్కునాయుడు పావని దంపతులు పవిత్ర అభిషేక పూజలు జరిపారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా మకర తోరణాన్ని అలంకరించి, భక్తిశ్రద్ధలతో విశేష అష్టోత్తర శతనామావళి పూజలను పండితులు రత్నకుమార్ నిర్వహించారు. మకర తోరణం అలంకరణ తర్వాత ఆంజనేయ స్వామివారి దివ్య రూపం మరింత శోభాయమానంగా, తేజోవంతంగా కనిపించడంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందంతో పులకించిపోయారు.

ఈ ఆధ్యాత్మిక వేడుకకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మకర తోరణం ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు ప్రసాద వితరణ ఏర్పాట్లు చేయడం అభినందనీయమని,ఇది ఒక గొప్ప సంకల్పమని పేర్కొంటూ చిన అక్కునాయుడును ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పయిల సన్యాసిరావు మాస్టారు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పల నాయుడు, ఇంచార్జ్ ఎంపీడీవో మల్లికార్జున రావు, జిల్లా టిఎన్టియుసి అధ్యక్షులు రొంగలి గోపాలకృష్ణ, పంచాయితీ కార్యదర్శి అచ్యుతరావు, డాక్టర్ పయిల సూరిబాబు, భాజపా నాయకులు కూండ్రపు సోమునాయుడు, గండి నమోబాబు, పయిల రామచంద్ర రావు, మాజీ వార్డు మెంబర్ గండి ఈశ్వరరావు, బొద్దపు అయ్యబాబు, బండారు రాజు, రెడ్డి నాగేశ్వర రావు, రెడ్డి నారాయణ రావు తదితర నాయకులు, స్థానిక పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు, చిన అక్కు నాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భక్తుల సేవే మా ధ్యేయం -- ప్రతి భక్తుడికి తిరుమలలో దివ్యానుభూతి.

- సనాతన ధర్మ పరి రక్షణే మా సంకల్పం.
- శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తాం.
- విద్య, వైద్యం, ధార్మిక సేవలకు పెద్ద పీట.
- అభివృద్ధిలో వేగం -- సేవల్లో నిబద్ధత.
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు.

**తిరుపతి, పెన్ సత్తా, ఆగస్టు 15:** ప్రపంచ నలుమూలల నుంచి తిరుమలకు విచ్చేసే శ్రీవారి భక్తుల సేవే టీటీడీ ప్రధాన ధ్యేయమని, సనాతన ధర్మ పరి రక్షణే తమ సంకల్పమని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ, విద్య, వైద్యం, ధార్మిక సేవలకు పెద్దపీట వేస్తూ అభివృద్ధిలో వేగం, సేవల్లో నిబద్ధతతో టీటీడీ ముందుకు సాగుతోందని ఆయన చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని తిరుపతి లోని టీటీడీ పరిపాలనా భవనంలో గల పరేడ్ మైదానంలో టీటీడీ చైర్మన్, ఈవో ముద్దాడ రవిచంద్రతో కలిసి శనివారం ఘనంగా నిర్వహించారు.

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తొలుత జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తరువాత భద్రతా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం చైర్మన్ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. వేంకటేశ్వర స్వామి దివ్య కైంకర్యాల్లో సేవలందిస్తున్న అర్చక స్వాములు, భక్తుల సేవలో తరిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, ఉద్యోగులు, భద్రతా సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, మీడియా మిత్రులు, అలాగే దేశ విదేశాల నుంచి తిరుమలకు విచ్చేస్తున్న భక్త కోటికి భారత 80 వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో వీరుల త్యాగఫలంగా సిద్ధించిన స్వాతంత్ర్య దినోత్సవాన్ని నేడు మనం జాతీయ పర్వదినంగా జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా దేశానికి వారి నిస్వార్థ సేవలను మనం నేడు స్మరించు కోవల్సిన అవసరం ఎంతైనావున్నది. మానవ సేవయే మాధవ సేవ అనే ఆదర్శంతో భక్తులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, సనాతన ధర్మ పరి రక్షణలో టీటీడీ ఎల్లప్పుడూ అంకితభావంతో ముందుంటుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను అని నాయుడు అన్నారు.

భక్తుల సేవే మా ధ్యేయం :
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ప్రతి భక్తుడు శ్రీవారి దివ్యదర్శనానంతరం దివ్యానుభూతితో తిరిగి వెళ్లేలా సేవలను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా టీటీడీ బోర్డు, యంత్రాంగం పనిచేస్తున్నది అన్నారు. జీయంగార్లు, ఆగమశాస్త్ర పండితుల మార్గదర్శకత్వంలో శ్రీవారి ఆలయంతో పాటు టీటీడీ ఆధ్వర్యం లోని అన్ని ఆలయాల్లో నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది అధికమాసం కారణంగా సెప్టెంబరు 15 నుండి 23 వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అదే విధంగా అక్టోబరు 12 నుంచి 20 వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే ప్రతి భక్తుడు శ్రీవారి దివ్యదర్శనం, వాహనసేవలను భక్తిశ్రద్ధలతో వీక్షించేలా సమగ్ర ఏర్పాట్లతో పాటు దేశవ్యాప్తంగా సంప్రదాయ కళాప్రదర్శనలను మరింత వైభవంగా నిర్వహిస్తాం అని తెలిపారు.

రూ.120 కోట్లతో అత్యాధునిక అన్న ప్రసాద వంటశాల :
అన్నిటి కన్నా అన్నదానం మహాదానం స్ఫూర్తితో లక్షలాది మంది భక్తులకు పరిశుభ్ర మైన, నాణ్యమైన అన్నప్రసాదం అందించేందుకు దాతల సహకారంతో రూ.120 కోట్లతో మరొక వంటశాలను నిర్మించాలని నిర్ణయం తీసుకున్నాం అన్నారు. తిరుమలను ఒక అద్భుత మైన పర్యావరణ ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చడంలో భాగంగా, దాతల సహకారంతో ప్రస్తుతం ఉన్న 12 ఎలక్ట్రిక్ బస్సులకు, అదనంగా మరో 32 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టి, భక్తులకు పర్యావరణ హితమైన, సౌకర్యవంత మైన రవాణా సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

దాతల సహకారంతో రూ.145 కోట్లతో అభివృద్ధి చేసిన తిరుమల ఎస్వీ మ్యూజియంలో శ్రీవారి సేవలు, ఉత్సవాలు, అరుదైన ఆభరణాల వైభవాన్ని 3 డీ, 7 డీ రూపంలో భక్తులకు త్వరలో అందుబాటు లోకి తీసుకువస్తాం. ఒంటి మిట్టకు విశేష ప్రాధాన్యం: కోదండ రామ స్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక వైభవానికి తగినట్లుగా తీర్చిదిద్దేందుకు విశ్రాంతి గృహాలు, యాత్రికుల సౌకర్యాలు, విద్యుత్ అలంకరణలు, భూసేకరణ తదితర అభివృద్ధి పనులను వేగంగా చేపట్టి, ఒంటిమిట్టను మరింత ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా శ్రీవారి ఆలయాల నిర్మాణం: శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పంతో దేశవ్యాప్తంగా టీటీడీ ఆలయాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తోంది. తమిళనాడు లోని కోయంబత్తూరులో 19.62 ఎకరాలు, అస్సాం లోని గౌహతిలో 10.32 ఎకరాలు, తెలంగాణ లోని ఖమ్మంలో 20 ఎకరాలు, కర్ణాటక లోని బెల్గాంలో 6.43 ఎకరాలు, ముంబై లోని బాంద్రా ప్రాంతంలో అదనంగా మరో 10 సెంట్లు, అదే విధంగా బీహార్ రాష్ట్రంలో కూడా భూమిని సేకరించి శ్రీవారి ఆలయాల నిర్మాణ పనులను ముందుకు తీసుకెళుతున్నాం అని నాయుడు ఈ సందర్భంగా తెలిపారు.



అదే విధంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర రాజధాని అమరావతి లోని వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని రూ.140 కోట్లతో మహారాజగోపురం, పుష్కరిణి, వాహన మండపం, తదితర నిర్మాణాలతో అభివృద్ధి చేస్తున్నాం. తిరుచానూరు, గోవిందరాజ స్వామి, శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు టీటీడీ ఆధ్వర్యం లోని అన్ని స్థానిక ఆలయాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం అన్నారు. ఆలయాల నిత్యకైంకర్యాలకు టీటీడీ మరింత చేయూత: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల ఆలయాలకు ధూప, దీప, నైవేద్యాల కోసం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచాం. దాతలకు పారదర్శక మైన, ఏకీకృత ప్రివిలేజెస్: టీటీడీ ట్రస్టులు, పథకాలకు విరాళాలు అందించే దాతలకు మరింత పారదర్శకతతో కూడిన ఏకీకృత ప్రివిలేజెస్‌ను అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

గత రెండేళ్లుగా టీటీడీ లోని వివిధ ట్రస్టులకు సుమారు రూ.1,500 కోట్లకు పైగా విరాళాలు అందించిన ప్రతి దాతకు టీటీడీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, టీటీడీకి చెందిన 64 స్థానిక, అనుబంధ ఆలయాల్లో శ్రీవారి స్వచ్ఛంద సేవ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడం జరిగింది. అదే విధంగా టీటీడీ ఆసుపత్రుల్లో శ్రీవారి వైద్యసేవను మరింత విస్తరించి, ఎక్కువ మంది రోగులకు నిస్వార్థంగా, నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాం.

టీటీడీ చరిత్రలో విద్యకు అత్యున్నత ప్రాధాన్యం: రూ.161.40 కోట్లతో టీటీడీ విద్యాసంస్థలను ప్రపంచ స్థాయి విద్యా కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నాం. ఆధునిక మౌలిక వసతులు, అత్యుత్తమ విద్యతో పాటు భారతీయ సంస్కృతి, నైతిక విలువలు, క్రమశిక్షణను విద్యార్థుల్లో పెంపొందించి, సమాజానికి ఆదర్శవంతమైన భావి పౌరులను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. టీటీడీ విద్యాసంస్థల్లో 10 వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 147 మంది విద్యార్థులకు "ప్రతిభా పురస్కారాలు" అందించి, విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాం. విద్యార్థినీ, విద్యార్థుల్లో సనాతన ధర్మం, క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించేందుకు టీటీడీ పాఠశాలలో నైతిక విలువలు, యోగా లలిత కళలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నాము. కొన్ని దశాబ్దాలుగా టిటిడి వైద్యరంగంలో సేవలు అందిస్తోంది. తిరుపతిలోని స్విమ్స్, బర్డ్ ఇతర ఆసుపత్రుల్లో వైద్యసౌకర్యాలు పెంచడం ద్వారా పేదరోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. చిన్నారులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలందించే పద్మావతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి త్వరలోనే అందుబాటు లోకి తీసుకువస్తాం.

స్విమ్స్ ఆసుపత్రిలో రోగులకు మరింత నాణ్యమైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు వివిధ విభాగాల్లో అవసరమైన ఉద్యోగ నియామకాలు చేపట్టాం. వివిధ ధార్మిక ప్రాజెక్టులు, వేద-భక్తి కార్యక్రమాల ద్వారా సనాతన హిందూ ధర్మాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి, భావితరాలకు ఆధ్యాత్మిక విలువలను చేరవేస్తున్నాం. హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత నృత్య కళాశాల తదితర విభాగాల్లో సేవలందిస్తున్న కళాకారుల నైపుణ్యాన్ని గుర్తించి, వారి పారితోషికాన్ని పెంచేందుకు చర్యలు తీసుకున్నాం.

సనాతన ధర్మాన్ని క్షేత్రస్థాయికి మరింత విస్తరించేందుకు వివిధ ధార్మిక సంస్థలకు టీటీడీ ఆర్థిక సహాయం అందిస్తోంది. ధర్మ ప్రచారం, ఆధ్యాత్మిక చైతన్యం, భారతీయ సంస్కృతి పరిరక్షణకు ఈ సహకారం ఎంతో దోహదపడుతోంది. వేద పారాయణ పథకం ద్వారా 791 మంది వేద పండితులను ప్రోత్సహిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో నిత్య వేదపారాయణం కొనసాగి సనాతన ధర్మ వైభవం చిరస్థాయిగా నిలిచేలా కృషి చేస్తున్నాం. ఉద్యోగుల సంక్షేమమే సంస్థకు నిజమైన బలం: జూన్ 21 న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని "యోగ--టీటీడీ ఆరోగ్యానంద" కార్యక్రమాన్ని తిరుపతిలో 17 కేంద్రాల్లో 14 రోజులపాటు నిర్వహించి, ఉద్యోగులు, విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెంపొందేలా ప్రతిరోజూ యోగ శిక్షణ అందించాం. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఘన సన్మానం:

టీటీడీ చరిత్రలో తొలిసారిగా 2026 జూలై 31 న తిరుపతి లోని మహతి కళాక్షేత్రంలో, ఈ ఏడాది జనవరి 1 నుంచి జూలై 31 వరకు పదవీ విరమణ పొందిన 280 మంది ఉద్యోగులను ఘనంగా సన్మానించాం. శ్రీవారి సేవలో విశిష్ట సేవలందించిన ఉద్యోగుల సేవలను గుర్తించి, వారి అంకితభావానికి కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అసత్య ప్రచారాలకు తావులేదు: భక్తుల మనోభావాలను దెబ్బతీసే తప్పుడు ప్రచారాలను టీటీడీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదు. అసత్యాలను అరికట్టి, భక్తుల విశ్వాసాన్ని పరిరక్షించేందుకు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నాం. నేటి ఈ కార్యక్రమం సందర్భంగా చక్కటి పరేడ్‌ను నిర్వహించిన టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారులు, సిబ్బందికి నా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి యావత్ ప్రపంచానికి శాంతి సౌఖ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను జైహింద్ అని తన ప్రశంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, సదాశివరావు, నరేష్ కుమార్, అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు డా.ఎ.శరత్, పి. గోపినాథ్, సివిఎస్వో కే వి మురళీకృష్ణ, అదనపు సివిఎస్వో శివకుమార్ రెడ్డి , సీఈ మనోహరం, సిపిఆర్వో డా.టి.రవి, డిఎఫ్వో డి. ఫణికుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కోదండ రాముని హృదయ కలశం ఊరేగింపు.





**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 15 :**త్రిదండి శ్రీ మన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి సప్తతి తిరునక్షత్ర మహోత్సవాలలో భాగంగా శనివారం ఉపమాక మాడవీధుల్లో కోదండరాముని హృదయ కలశం ఊరేగింపు ఘనంగా జరిగింది. శంషాబాద్ ఆశ్రమం నుండి వచ్చిన కోదండ రాముని హృదయ కలశ ఊరేగింపు ఉపమాక కల్కి వేంకటేశ్వర స్వామి వారి మాడ వీధులలో ఊరేగించారు. దీనిలో భాగంగా నక్కపల్లి శ్రీవైష్ణవ ఘోస్ట్ కి చెందిన నున్న సుభాష్ బృందం ఆధ్వర్యంలో వికాసి తరంగణి సభ్యులు స్థానిక భక్తుల శ్రీరామ నామ స్మరణల మధ్య కలశాన్ని ఊరేగించారు.

కోదండ రాముని హృదయ కలశలో భక్తులు గోముఖముద్రతో బియ్యాన్ని సమర్పించారు. ఈ కలశం ఈనెల 22వ తేదీన శంషాబాద్ లో గల ఆశ్రమానికి పంపించడం జరుగుతుందని దీపావళి రోజున జరిగే స్వామివారి తిరునక్షత్ర మహోత్సవంలో ఈ కలశలతో 108 దివ్య దేశాలలో ఉన్నటువంటి మూర్తులకు, కోదండ రామునికి విశేష అభిషేకాధి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని కలిగి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల శ్రీమన్నారాయణ శిష్యులు,పలువురు భక్తులు పాల్గొన్నారు.

# డిజిటల్ మహిళా బజార్ నిర్వహణ





**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్ట్ 15:**స్వాతంత్ర్య దినోత్సవం శుభ సందర్భంగా ఆగస్ట్ 15 శనివారం స్థానిక సుంకర కల్యాణ మండపంలో డిజిటల్ మహిళ సంఘం, అనకాపల్లి ప్రేరణ సంఘం ఆధ్వర్యాన డిజిటల్ మహిళా బజార్ నిర్వహించనున్నట్లు సంఘమిత్రాలు తెలిపారు. డిజిటల్ మహిళ సంస్థ వ్యవస్థాపకులు, అధ్యక్షులు డా. ఆశ్లేష ఈదెల సంకల్పానికి అనుగుణంగా మహిళా చైతన్యాన్ని, ఆర్థిక అభివృద్ధి చెందే విధంగా డిజిటల్ మహిళా సంఘాలు కృషి చేస్తున్నాయన్నారు. అనకాపల్లి ప్రేరణ సంఘం సభ్యులు వివిధ రకాల ఉత్పత్తులను స్టాల్ లో ప్రదర్శించి అమ్ముతారన్నారు.

# రేంజ్ కార్యాలయంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలో ఐజీ గోపీనాథ్ జెట్టి




**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్టు 15:**రేంజ్ కార్యాలయంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలో జాతీయ పతాకావిష్కరణ చేసి గౌరవ వందనం చేసిన ఐజీ గోపీనాథ్ జెట్టి. తదనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ సిబ్బందికి, విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసి, మిఠాయిలు అందజేశారు. స్వాతంత్ర్య కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధులను గుర్తు చేసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, దేశభక్తి భావాన్ని చాటుతూ భావితరాలు ఆ దిశగా నడిచేలా సమిష్టిగా కృషి చేద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ధనుంజయ నాయుడు, ఇనస్పెక్టర్ లు అశోక్ కుమార్, సూరి నాయుడు, నాగేశ్వరరావు, రేంజ్ కార్యాలయ ఏ.ఏ.ఓ నాగలక్ష్మి, మేనేజర్ సూర్యారావు, ఆఫీస్ సూపరింటెండెంట్ భవాని , సీసీ గణేష్ మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వాడ వాడల రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

పండగలా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు






**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 15:** మండలంలో వాడవాడలా మువ్వెన్నెల జెండా రెపరెపలాడింది. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మండల కేంద్రం నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పండగలా నిర్వహించారు. మన భారతదేశానికి స్వాతంత్రం సాధించిన ఎందరో మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ గీతాలను ఆలపించి జెండా ఎగరవేసి వందనం తెలియజేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పలు పాఠశాలల్లో ఆటల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పలు గ్రామాల్లోఈ ఏడాది పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేసి సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉపమాక ప్రభుత్వ పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన చదువుల తల్లి సరస్వతి దేవి, మహాత్మా గాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలను నక్కపల్లి పిఎసిఎస్ చైర్పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో నక్కపల్లి సిఐ జె. మురళి చేతుల మీదగా విగ్రహాలను ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద జెండా పండుగను ఘనంగా నిర్వహించి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు.

# మార్షల్ ఆర్ట్స్ నేర్పించిన క్రమశిక్షణ: జనసేనాని గురించి ఎవరికీ తెలియని నిజాలు!



మార్షల్ ఆర్ట్స్ నుంచి సినిమాలు, రాజకీయ రంగం వరకు పవన్ కళ్యాణ్ ప్రయాణం ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది. ఇటీవల ఆయన మార్షల్ ఆర్ట్స్ ప్రయాణానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో అభిమానుల నుంచి అపారమైన ప్రేమ వెల్లువెత్తింది. కేవలం ఒక నటుడిగానే కాకుండా ఆయనలోని గొప్ప క్రమశిక్షణ- సద్గుణాలు సంఘంలో ప్రత్యేకంగా నిలబెట్టాయి. నేడు ఇండిపెండెన్స్ డే సందర్భంగా పవన్ లోని క్రమశిక్షణ, మంచి లక్షణాల గురించి యువతరం సోషల్ మీడియా వేదికలపై మరోసారి చర్చిస్తోంది.పవన్ కళ్యాణ్ పై అభిమానులు చూపే ఆత్మీయత ఎంతో భావోద్వేగమైనది. దీనికి అభిమానుల కామెంట్లు పెద్ద ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. -పుట్టింది నీ అభిమానిగానే.. శ్వాస విడిచేది నీ అభిమానిగానే! అంటూ సోషల్ మీడియా కామెంట్లలో అభిమానులు తమ నిష్కల్మషమైన ప్రేమను చాటుకుంటున్నారు. పవన్ కళ్యాణ్‌ను కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో -టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్-.. -ది ఒరిజినల్ హీరో (రా+)- అని అభివర్ణిస్తూనే... ఆయన సమాజానికి దిశానిర్దేశం చేసే ఒక -టార్చ్ బేరర్- లాంటి మనిషి అని కొనియాడారు.

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కళ్యాణ్ ఆలోచనలు, నిర్ణయాలు సమాజంలో కొత్త మార్పునకు శ్రీకారం చుట్టాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ ఆయన యువతకు ఇచ్చిన సందేశం సమాజ నిర్మాణంలో వారి బాధ్యతను గుర్తుచేసింది. విధ్వంసక రాజకీయాలకు దూరంగా ఉంటూ.. వ్యవస్థలను సరిచేయడమే అసలైన పురోగతి అని ఆయన స్పష్టం చేశారు.దేశ విభజన గాయాల జ్ఞాపకార్థ దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ షేర్ చేసిన పోస్ట్ అందరినీ ఆలోచింపజేసింది. 1947 నాటి విభజన వల్ల ఇళ్లను, కుటుంబాలను కోల్పోయి లక్షలాది మంది ప్రజలు అనుభవించిన ఆవేదనను ఆయన గుర్తుచేసుకున్నారు. ఆ చీకటి రోజుల్లోనూ మన పూర్వీకులు ప్రదర్శించిన ధైర్యం- ఓర్పు - మానవత్వం నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. గతంలోని కష్టాల నుంచి పాఠాలు నేర్చుకుని ఐక్యత- సామరస్యం- శాంతితో ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. విభజనలను గుర్తుచేసుకోవడం అంటే గతాన్ని తవ్వుకోవడం కాదని.. రేపటి మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవడమేనని స్వాతంత్ర్య దినోత్సవ సామాజిక నోట్ లో జనసేనాని స్పష్టం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించుకోవాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్న పవన్ కళ్యాణ్ పార్టీలకు అతీతంగా అందరి మన్ననలు పొందుతున్నారు.

# తెరపైకి క్రెడిట్ వార్

ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు మళ్లీ వార్తలకటటక్కింది. కేంద్ర ప్రభుత్వం పోలవరం ఫేజ్-1 నిర్మాణ సవరించిన అంచనా వ్యయానికి రూ.30,436.95 కోట్లు ఆమోదించడం, దాదాపు రూ.12,157 కోట్లకు పైగా బ్యాలెన్స్ గ్రాంట్‌ను ఖరారు చేయడంతో రాష్ట్రంలో క్రెడిట్ గేమ్ జోరందుకుంది. కేంద్రంలో పట్టుబట్టి, ఎన్డీయే భాగస్వామిగా ఒత్తిడి తెచ్చి పోలవరానికి రూ.12,000 కోట్లకు పైగా ప్రత్యేక నిధులు తీసుకువచ్చామని, ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించామని అధికార కూటమి ప్రచారం చేసుకుంటోంది. మరోవైపు, తమ హయాంలోనే ఫేజ్-1 ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించి, 41.15 మీటర్ల పరిమితికి అనుగుణంగా సాంకేతిక అనుమతులు సాధించామని, ఆ కష్టఫలమే నేడు కేంద్రం ఇచ్చిన ఆమోదమని వైఎస్ఆర్‌సీపీ తమ ఖాతాలో వేసుకునే యత్నం చేస్తోంది.ఈ పొలిటికల్ డిబేట్‌లో ఇరుపక్షాలు విసురుకుంటున్న ఆరోపణలు, ప్రత్యారోపణలు క్షేత్రస్థాయి వాస్తవాలను దాచిపెడుతున్నాయి. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం 70 శాతానికి పైగా పనులు పూర్తి చేసిందని, డయాఫ్రమ్ వాల్‌తో సహా ప్రధాన నిర్మాణాలను వేగవంతం చేసిందని టీడీపీ శ్రేణులు చెప్తున్నాయి. కానీ, 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్‌సీపీ రివర్స్ టెండరింగ్ పేరుతో ఏజెన్సీని మార్చడం వల్ల ప్రాజెక్టు ఆలస్యమైందని, 2020 గోదావరి వరదల్లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి జగన్ సర్కార్ అజ్ఞానమే కారణమని టీడీపీ తీవ్రంగా కౌంటర్ ఇస్తోంది. దానికి పోటీగా, పోలవరం కాంట్రాక్టులను నాటి టీడీపీ ప్రభుత్వం తమ అనుకూల ఏజెన్సీలకు కట్టబెట్టి అంచనాలు పెంచేసిందని, తాము వచ్చి అవినీతిని అరికట్టి నిధులను సద్వినియోగం చేశామని వైఎస్ఆర్‌సీపీ కౌంటర్ ఇస్తోంది.ఈ క్రెడిట్ గేమ్ లో పొలిటికల్ లీడర్లు ఎవరు పైచేయి సాధించినా.. ప్రజా క్షేత్రంలో మాత్రం అసలైన విజేత ప్రాజెక్టు పూర్తయినప్పుడే తేలుతుంది. కేవలం మాటల విన్యాసాల వల్ల ఓటర్లు ఓట్లేయరనేది గత అనుభవాలు నిరూపించాయి. జగన్ హయాంలో రివర్స్ టెండరింగ్ వల్ల ప్రాజెక్టు ఐదేళ్లు వెనక్కి వెళ్లడమే కాకుండా, రూ.15,000 కోట్ల మేర ఆర్థిక నష్టం జరిగిందనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. అందుకే, ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రెడిట్ దక్కించుకోవాలంటే కేవలం వైఎస్ఆర్‌సీపీపై నిందలు వేస్తే సరిపోదు; అనుకున్న గడువులోగా గ్రావిటీ ద్వారా నీళ్లను అందించాల్సి ఉంటుంది. కేంద్ర జలశక్తి శాఖ రాజ్యసభ వేదికగా స్పష్టం చేసిన వివరాల ప్రకారం, ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే కాంక్రీట్ పనులు 98.84%, ప్రధాన కాలువల తవ్వకం 98.96% వరకు పూర్తయ్యాయి. అయితే, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం, ఎర్త్-కమ్-రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణం పూర్తికావడం అత్యంత కీలకమైన సవాలు. కేంద్ర జలశక్తి శాఖ అంచనాల ప్రకారం తొలి దశ 41.15 మీటర్ల నీటి మట్టం పనులను అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అవసరమైతే మరొక ఏడాది కాలపరిమితి పెరిగినా.. 2027 నాటికి తొలి దశ నీటిని నిల్వ చేసి, కాలువల ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. పోలవరం కేవలం కాంక్రీట్ నిర్మాణం మాత్రమే కాదు, అది వేలాది మంది గిరిజనులు, రైతుల పునరావాస సమస్య. ఫేజ్-1 లో దాదాపు 96,660 నిర్వాసిత కుటుంబాలు ఉండగా, ఇప్పటివరకు కేవలం 17,892 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. నీరు నిల్వ చేయాలంటే మిగిలిన వేలాది కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు ఇచ్చి ఖాళీ చేయించాలి. కాబట్టి, డ్యామ్ నిర్మాణం 2026-27 నాటికి పూర్తయినా, నిర్వాసితులకు పరిహారం చెల్లించి, నిధుల సమస్య లేకుండా పునరావాసం పూర్తి చేస్తేనే రైతులకు పూర్తిస్థాయిలో నీటి ఫలాలు అందుతాయి. రాజకీయం పక్కనపెట్టి, కేంద్రం ఇచ్చిన నిధులతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయడమే ఏపీ భవిష్యత్తుకు శ్రీరామరక్ష

# మావిగన్‌కు సమర్థింపుగా అవిగన్ తెస్తున్నారా?



మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత పేర్ని నాని ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమరావతి రాజధానిని అవిగన్ అమరావతి - విజయవాడ - గుంటూరు గా సిఆర్‌డిఎ లో తీర్మానం చేశారని, త్వరలోనే కేబినెట్ ముందుకు తీసుకురాబోతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ కాస్తా ఇప్పుడు అవిగన్ గా మారిందని ఆయన సెటైర్లు వేశారు. అది జగన్ ఎఫెక్ట్ అంటున్నారు. మొదటగా సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌ను గమనిస్తే.. 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పటి నుంచీ విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, తెనాలి సహా చుట్టుపక్కల వందలాది గ్రామాలు సీఆర్డీఏ పరిధిలోనే ఉన్నాయి. కోర్ క్యాపిటల్ సిటీగా 217 చదరపు కిలోమీటర్ల అమరావతి ప్రాంతం ఉంటే, దాని సమగ్ర అభివృద్ధికి 8,300 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తీర్ణాన్ని సీఆర్డీఏ పరిధిగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పుడు ప్రత్యేకంగా అవిగన్ పేరుతో క్రొత్తగా ఏదో తీర్మానం చేస్తున్నారని నాని చెప్పడం కేవలం ఒక కొత్త రాజకీయ అస్త్రాన్ని ప్రయోగించడమే తప్ప, అందులో కొత్తగా చట్టపరమైన మార్పు ఏదీ లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే, పేర్ని నాని వ్యాఖ్యల్లో అంతర్లీనంగా ఉన్న రాజకీయ మార్పును గమనించాల్సి ఉంది ఐదేళ్ల పాటు మూడు రాజధానుల మంత్రం జపించి, అమరావతిని కేవలం ఒక రియల్ ఎస్టేట్ భ్రమ అని వర్ణించిన వైఎస్ఆర్‌సీపీ నేతలు.. ఇప్పుడు అమరావతి, విజయవాడ, గుంటూరు ప్రాంతాల అనుసంధానత గురించి మాట్లాడుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో అమరావతిని పక్కనపెట్టడం వల్ల కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పార్టీ తీవ్రంగా దెబ్బతిన్నది. 2024 ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల్లో వైఎస్ఆర్‌సీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న తర్వాత, అమరావతి ఉనికిని పూర్తిగా వ్యతిరేకించడం పార్టీ ఉనికికే ప్రమాదమని గుర్తించినట్లే కనిపిస్తోంది.ఈ పరిణామం వైఎస్ఆర్‌సీపీ అమరావతికి జై కొడుతోందా అనే ప్రశ్నకు ప్రత్యక్షంగా అవును అని చెప్పలేకపోయినా, పరోక్షంగా యు-టర్న్ తీసుకుంటోందనే సంకేతాలనైతే ఇస్తోంది. రాజధాని నిర్మాణాన్ని నేరుగా అంగీకరిస్తే ఇన్నాళ్లూ తమ స్టాండ్ తప్పని ఒప్పుకున్నట్లు అవుతుంది. అందుకే, అమరావతి అభివృద్ధిని, సీఆర్డీఏ విస్తరణను కూటమి ప్రభుత్వం మళ్లీ మాట మారుస్తోంది అని నిందించే క్రమంలో అవిగన్ అనే పదాన్ని తెరపైకి తెచ్చారు. రాజధాని వ్యయాన్ని, నగరాల ఏకీకరణను ప్రశ్నించే పేరుతో అమరావతి చర్చలోకి వైఎస్ఆర్‌సీపీ మళ్లీ ప్రవేశించే యత్నం చేస్తోంది.ప్రభుత్వం వైపు నుంచి చూస్తే.. అమరావతిని కేవలం పాలనా నగరంగానే కాక, విజయవాడ, గుంటూరులను కలుపుతూ విశాలమైన మెగా సిటీ గా మౌలిక వసతులు అభివృద్ధి చేయడం మొదటి నుంచి ఉన్న ప్రతిపాదనే. గ్రీన్ ఫీల్డ్ క్యాపిటల్ అమరావతితో పాటు బ్రౌన్ ఫీల్డ్ నగరాలైన విజయవాడ, గుంటూరులను ఎకనామిక్ కారిడార్లుగా మార్చడం సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్ ముఖ్య ఉద్దేశం. దీనిని ప్రభుత్వం కొత్తగా దాచాల్సిన అవసరం గానీ, జగన్ దెబ్బకు భయపడి మార్చాల్సిన అవసరం గానీ లేదనేది అధికార కూటమి నేతల వాదన. పేర్ని నాని చేసిన అవిగన్ వ్యాఖ్యలు వైఎస్ఆర్‌సీపీ మారుతున్న రాజకీయ సమీకరణాలకు అద్దం పడుతున్నాయి. రాజధానిపై గతంలో తీసుకున్న కఠిన వైఖరిని పక్కనబెట్టి, సీఆర్డీఏ పరిధి, వ్యయం, నగరాల విలీనం వంటి అంశాలపై సాంకేతిక ప్రశ్నలు వేయడం ద్వారా అమరావతి ప్రాంత ప్రజల్లో పోయిన విశ్వాసాన్ని పునరుద్ధరించుకోవడానికి ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. అయితే, ఈ మాటల విన్యాసాలు వైఎస్ఆర్‌సీపీకి ఎంతవరకు రాజకీయ ప్రయోజనం చేకూరుస్తాయో కాలమే నిర్ణయించాలి.

## వైసీపీని ఇరుకున పడేస్తున్న కోర్టు తీర్పు



కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్ జరిగింది అంటూ వైఎస్ఆర్‌సీపీ గత కొంతకాలంగా ఉద్యమం చేస్తోంది. అయితే, ఈ ఆరోపణలకు తగిన ఆధారాలు చూపించడంలో వైఎస్ఆర్‌సీపీ ఘోరంగా విఫలమవడంతో ఆ నిరసనలకు పొలిటికల్ మైలేజ్ దక్కలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. కానీ, అదే సమయంలో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 మూల్యాంకనంలో ఘోరమైన అక్రమాలు జరిగాయని ప్రత్యేక దర్యాప్తు బృందం హైకోర్టుకు నివేదిక సమర్పించడం ఏపీ రాజకీయాల్లో మైండ్ గేమ్ మార్చేసింది. డీఎస్సీపై ఎలాంటి క్లూస్ ఇవ్వలేకపోయిన వైఎస్ఆర్‌సీపీకి, గ్రూప్-1 కేసు రూపంలో కూటమి ప్రభుత్వానికి అత్యంత పవర్ ఫుల్ ఆయుధం దొరికినట్లయింది.సిట్ దాఖలు చేసిన తాజా నివేదిక ఆధారంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్‌సీపీ హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో వ్యవస్థాగతంగా తీవ్రమైన అవకతవకలు జరిగాయని పక్కా నిరూపణలతో సహా బయటపడింది. డిజిటల్ మూల్యాంకనం రద్దు కావడం, హాయ్‌లాండ్ రిసార్ట్‌కు నిబంధనలకు విరుద్ధంగా జవాబు పత్రాలు తరలించడం, ఓఎంఆర్ వాల్యుయేషన్ స్లిప్పులపై సరిదిద్దడం వరకు చోటుచేసుకున్న తీరు షాకింగ్‌గా ఉంది. ల్యాబ్ ఫోరెన్సిక్ రిపోర్టుల ప్రకారం తనిఖీ చేసిన 736 వాల్యుయేషన్ రికార్డుల్లో ఏకంగా 718 రికార్డులలోఅంటే 97.55 శాతం దిద్దుబాట్లు, ఓవర్ రైటింగ్‌లు జరిగాయని తేలడం నాటి వ్యవహారం ఎంత దారుణంగా సాగిందో తెలియజేస్తోంది.ఈ మొత్తం వ్యవహారంలో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి, సీనియర్ ఐపీఎస్ అధికారి పి.ఎస్.ఆర్. ఆంజనేయులు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనుమతి లేకుండానే జవాబు పత్రాలను హాయ్‌లాండ్ రిసార్ట్‌కు తరలించి, 84 రోజుల పాటు ప్రైవేట్ ఏజెన్సీ క్యామ్‌సైన్ మీడియా కస్టడీలో ఉంచడం వెనుక ఆయనే కీలక పాత్ర పోషించారని సిట్ గుర్తించింది. దాదాపు రూ.1.14 కోట్ల ప్రజాధనాన్ని సదరు ఏజెన్సీకి అప్పగించి, కేవలం ముందస్తు డిజిటల్ మార్కులను మళ్లీ రావీ= రికార్డుల్లో ఎంట్రీ చేయించేలా డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇప్పించారనే ఆరోపణలు నాడు ఐపీఎస్ అధికారి హోదాలో ఆయన నడిపిన నెట్‌వర్క్‌ను ఎండగడుతున్నాయి. హైకోర్టు ఆదేశాల ప్రకారం మ్యాన్యువల్ వాల్యుయేషన్ చేయాలని చెప్తూనే.. నిబంధనలకు విరుద్ధంగా వైట్‌నర్ వాడటం, సీనియర్ ఎగ్జామినర్ల సంతకాలు లేకపోవడం, కొత్త సంతకాలు కలవకపోవడం, 197 మందికి మార్కులు పెంచి, 222 మందికి మార్కులు తగ్గించడం వెనుక పెద్ద ఎత్తున పొలిటికల్ అండ్ ఫైనాన్షియల్ డీలింగ్స్ ఉన్నట్లు అనుమానాలు బలపడుతున్నాయి. సీఎస్ ఆప్షన్ లేని చోట నాటి వైఎస్ఆర్‌సీపీ పెద్దల ఓరల్ ఇన్‌స్ట్రక్షన్స్ ఆధారంగానే మార్కులు మార్చారని సిట్ రిపోర్ట్ తేల్చిచెప్పడం గేమ్ ఛేంజర్‌గా మారుతోంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న గ్రూప్-1 అధికారులను గనుక సిట్ లోతుగా ప్రశ్నిస్తే మరింత సంచలన విషయాలు బయటకు రావడం ఖాయం. నాటి మూల్యాంకనంలో అసలైన మెరిట్ అభ్యర్థులకు అన్యాయం చేసి, ఎవరెవరికి మార్కులు పెంచి కొలువులు కట్టబెట్టారో లబ్ధిదారులైన అధికారుల మూలాల నుంచి వెలికితీసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. డీఎస్సీ పరీక్షలపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూసిన వైఎస్ఆర్‌సీపీ.. ఇప్పుడు గ్రూప్-1 సిట్ నివేదికతో తామే ఇరుక్కుపోయిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల ముందే నిరుద్యోగ ఓట్ బ్యాంకును ఆకట్టుకోవడానికి వైఎస్ఆర్‌సీపీ ప్రయత్నించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం నాటి గ్రూప్-1 స్కామ్‌ను ఎండగడుతూ రివర్స్ కౌంటర్ ఇస్తోంది. ఆధారాలతో సహా ఫోరెన్సిక్ రిపోర్టులు కోర్టుకు చేరడంతో, పిఎస్ఆర్ ఆంజనేయులు సహా ఈ కుంభకోణంలో ప్రమేయమున్న కీలక సూత్రధారులపై చట్టపరమైన ఉచ్చు బిగుసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

## సర్వీసులతో భోగాపురం



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో సరికొత్త సందడి నెలకొంది. ఈనెల 17 నుంచి పూర్తిస్థాయిలో విమాన సర్వీసులు ప్రారంభం అవుతాయి. ఈనెల 1న ప్రధాని నరేంద్ర మోడీ ఈ విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేసిన సంగతి తెలిసిందే. అయితే 17 నుంచి విమాన రాకపోకలు ప్రారంభం అవుతాయని పౌర విమానయాన ఇప్పటికే ప్రకటన చేసింది. అయితే దానికి కేవలం రెండు రోజుల గడువు మాత్రమే ఉంది. ప్రైవేటు ఎయిర్లైన్స్ సైతం తమ సర్వీసులను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. అయితే తొలి రోజు ఏకంగా 31 సర్వీసులను నడప నుంది ఇండిగో ఎయిర్లైన్స్. హైదరాబాద్, తిరుపతి, బెంగళూరు, చెన్నై సహా పలు నగరాలకు ఈ విమానాలు నడవనున్నాయి. తన తొలి రోజు సర్వీస్ లను ప్రకటించింది ఇండిగో ఎయిర్లైన్స్.ఈనెల 16 అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్పోర్ట్ నుంచి విమాన సర్వీసులు రద్దు అవుతాయి. అక్కడ నుంచి సేవలందించే విమానాలన్నీ భోగాపురం నుంచి మొదలవుతాయి. ఈ క్రమంలో విమాన సర్వీసుల రాకపోకలపై ఎయిర్లైన్స్ సంస్థలు ఒక్కొక్కటి షెడ్యూల్ విడుదల చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇండిగో విమానయాన సంస్థ తొలి రోజు 31 సర్వీసులను ప్రారంభించనున్నట్లు తెలిపింది. భోగాపురం నుంచి ఆరోజు ఉదయం 8:55, 10:40, మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం 4:25, రాత్రి 7:20, 8:40, 9 20 గంటలకు విమానాలు బయలుదేరనున్నాయి. భోగాపురం నుంచి ఢిల్లీకి ఉదయం 8:20, రాత్రి 10:45... బెంగళూరుకు మధ్యాహ్నం 2:55, రాత్రి 9:10, చెన్నైకి మధ్యాహ్నం 12:15, సాయంత్రం 6:35.. కోల్కత్తా కు రాత్రి 7:50, ముంబైకి మధ్యాహ్నం 3:05, తిరుపతికి మధ్యాహ్నం 1:50 గంటలకు విమానాలు అందుబాటులోకి వస్తాయని ఇండిగో తెలిపింది మరోవైపు ఎయిర్ ఇండియా కూడా అక్టోబర్ 24 వరకు భోగాపురం నుంచి నడిచే విమానాల షెడ్యూల్ ను ప్రకటించింది. హైదరాబాదు నుంచి భోగాపురం మధ్య రోజుకు ఐదు సర్వీసులు.. బెంగళూరు నుంచి భోగాపురం మధ్య రోజుకు రెండు సర్వీసులు నడపనుంది. ఆది, శుక్రవారం మినహా మిగిలిన ఐదు రోజులు మరో సర్వీస్ అందుబాటులో ఉంటుంది. విజయవాడ నుంచి భోగాపురం మధ్య రోజుకు నాలుగు సర్వీసులు నడవనున్నాయి. భోగాపురం ఎయిర్పోర్ట్ నుంచి కమర్షియల్ సర్వీసులో తొలి విమానం సింగపూర్ కు వెళ్లనుంది. ఆగస్టు 16న రాత్రి 11:05 గంటలకు స్కూట్ ఎయిర్లైన్స్ విమానం భోగాపురం లో ల్యాండ్ అవుతుంది. ఈ విమానం గంట తర్వాత 12:05 గంటలకు సింగపూర్ బయలుదేరుతుం

భారత జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ ఆపరేషన్ సిందూర్‌పై తొలిసారిగా బహిరంగంగా మౌనం వీడారు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రసారమైన డిస్కవరీ డాక్యుసిరీస్ 'డిక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్'లో.. ఉగ్రవాదానికి పాల్పడేవారికి స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. "భారత్ ఔదార్యాన్ని, సహనాన్ని బలహీనతగా భావించకూడదు. అవసరమైతే భారత్ రిస్క్ తీసుకోగలదు, పరిణామాలతో సంబంధం లేకుండా గట్టిగా దెబ్బతీయగలదు" అంటూ ప్రపంచానికి స్పష్టమైన సందేశమివ్వడం అభినందనీయం. పహల్గాం ఉగ్రదాడికి బాధ్యులైన శిబిరాలను ధ్వంసం చేయడమే 88 గంటల సైనిక చర్య లక్ష్యంగా నిర్దేశించుకున్నామని దోవల్ వెల్లడించారు. 2025 మే 6-7 అర్ధరాత్రి ప్రారంభమైన ఆపరేషన్.. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు నిర్వహించింది. సరిహద్దు ప్రాంతాల్లో కాకుండా, పాకిస్తాన్ లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకెళ్లి తొమ్మిది లక్ష్యాలను ధ్వంసం చేయగలిగామని, బ్రహ్మోస్ క్షిపణులు, సమీకృత వైమానిక నియంత్రణ వ్యవస్థ వంటి స్వదేశీ సాంకేతికత ఎంత సమర్థంగా పనిచేసిందో దోవల్ గతంలోనూ ఐఐటీ మద్రాస్ స్నాతకోత్సవంలో ప్రస్తావించారు. భారత్‌వైపు ఒక్క అద్దం పగలలేదని, దీనికి ఆధారాలు చూపాలని విదేశీ మీడియాకు దోవల్ సవాలు విసిరారు. వంద మందికిపైగా ఉగ్రవాదులను హతమార్చడంతోపాటు, పలు వ్యూహాత్మక, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసిన ఆపరేషన్, మే 10న ఇరు దేశాల మధ్య అవగాహన కుదిరేవరకూ కొనసాగింది. మాజీ సైనిక దళాల చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ సైతం డాక్యుసిరీస్‌లో మాట్లాడుతూ, పహల్గాం దాడి యావత్ దేశాన్నీ కుదిపేసిందని, ఇలాంటి బెదిరింపులకు భారత్ తలొగ్గబోదని నిర్ణయించుకున్నామన్నారు.

ఇదే సమయంలో, దాయాది పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి తన అలవాటైన రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దిగడం గమనార్హం. పాకిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవానికి ఒకరోజు ముందు ఇస్లామాబాద్‌లో 'యాద్గార్-ఎ-ఫతే' (విజయ స్మారకం) ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ, 2025 మే నెల ఘర్షణలను 'మర్కా-ఎ-హక్' (సత్యపోరాటం)గా అభివర్ణిస్తూ, తాము విజయం సాధించామని అసత్య ప్రచారం చేశారు. సింధూ జలాల ఒప్పందంపైనా బెదిరింపు స్వరంతో మాట్లాడుతూ, "పాకిస్తాన్ నీటి వాటాలో ప్రతి బొట్టు మా రెడ్‌లైన్" అని ప్రకటించారు. భారత్ సరైన మార్గంలోకి రాకపోతే ప్రత్యక్షంగా బదులిస్తామనీ హెచ్చరించారు. అయితే, వాస్తవానికి ఈ ప్రేలాపనలు పాక్ ఎదుర్కొంటున్న అంతర్గత సంక్షోభాల నుంచి ప్రజల దృష్టి మళ్లించే ఎత్తుగడేనన్నది తెలీంది కాదు. ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఉగ్రవాద హింస రోజురోజుకూ పెరుగుతుండగా, బలూచిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు తీవ్రమవుతున్నాయి. ఈ అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి భారత్‌ను బూచిగా చూపడం షెహబాజ్‌కు అలవాటైన రాజకీయ ఎత్తుగడ. పహల్గాం దాడి అనంతరం భారత్ ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా సింధూ ఒప్పందాన్ని నిలిపివేసిందని షెహబాజ్ ఆరోపించగా, ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు ఇవ్వడం మానేసేవరకూ ఒప్పందం అలాగే కొనసాగుతుందని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పి.హరీశ్ ఇప్పటికే స్పష్టం చేశారు. తామేమీ మిలిటరీ

## ..తగిన సమాధానం!

పరిష్కారాన్ని కోరుకోవడం లేదని, చర్చల ద్వారానే శాంతి సాధ్యమని ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ వంటివారు అంతర్జాతీయ వేదికలపై అంటుంటే, షెహబాజ్ మాత్రం పదేపదే బెదిరింపు భాషనే ఎంచుకోవడం, పాకిస్తాన్ నాయకత్వం వాస్తవికతకు ఎంత దూరంగా ఉందో తేటతెల్లం చేస్తోంది.

ఆపరేషన్ సిందూర్ తరువాత భారత్ వ్యూహం స్పష్టం, స్థిరం. ఆపరేషన్ జరిగిన వెంటనే అమెరికా, జపాన్, బ్రిటన్, సౌదీ అరేబియా, యూఏఈ, రష్యా, చైనా సహా పలు దేశాల భద్రతా సలహాదారులతో దోవల్ స్వయంగా మాట్లాడి, భారత చర్య 'కొలమానంతో కూడిన, తీవ్రతరం చేయని' విధానంలోనే సాగిందని స్పష్టం చేయడం ముందుచూపు. ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం తమకు లేదని, అయితే పాక్ తీవ్రతరం చేసే యత్నం చేస్తే, గట్టిగా, నిర్ణయాత్మకంగా బదులివ్వడానికి సిద్ధంగా ఉన్నామని కూడా స్పష్టం చేశారు. ఈ ద్వంద్వ సందేశం - నిగ్రహం ప్రదర్శిస్తూనే, అవసరమైతే నిర్ణయాత్మకంగా వ్యవహరించే సంసిద్ధత -భారత్ కొత్త వ్యూహాత్మక వైఖరికి ప్రతీక. సైనిక చర్యల్లో మాత్రమే కాదు, దౌత్యపరంగానూ భారత్ ఈ సమతుల్యతను

## సంపాదకీయం

కొనసాగిస్తోంది. ఒకవైపు ఉగ్రవాదంపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేస్తూనే, మరోవైపు అంతర్జాతీయ సమాజంతో సంబంధాలను చెడగొట్టుకోకుండా, తన చర్యల వెనుక ఉన్న న్యాయబద్ధతను ప్రపంచానికి వివరించే ప్రయత్నం చేస్తోంది. ఇప్పుడు దోవల్ డాక్యుసిరీస్ ద్వారా బహిరంగంగా మాట్లాడటం కూడా అదే వ్యూహంలో భాగం. దేశ ప్రజలకు, ప్రపంచానికి భారత సైనిక, భద్రతా నాయకత్వం వెనుక ఉన్న ఆలోచనా విధానాన్ని, నిర్ణయాత్మక సంకల్పాన్ని స్పష్టం చేయడం. ఇది కేవలం గత చర్యలను గుర్తుచేసుకోవడం మాత్రమే కాదు, భవిష్యత్తులో ఇలాంటి ముప్పులు ఎదురైతే భారత్ ఎలా స్పందిస్తుందో స్పష్టమైన సంకేతం ఇవ్వడం కూడా.

ఈ మొత్తం పరిణామాల నుంచి స్పష్టమయ్యేదేమిటంటే, భారత్ ఇప్పుడు క్రియాశీల నిరోధక వైఖరిని బలంగా అనుసరిస్తోంది. నిగ్రహం బలహీనత కాదని, వ్యూహాత్మక ఎంపిక మాత్రమేనని ప్రపంచానికి చాటుతోంది. సరిహద్దు ఆవలి నుంచి వచ్చే ముప్పులకు గట్టిగా, నిర్ణయాత్మకంగా స్పందించే సామర్థ్యం, సంసిద్ధత రెండూ తనకున్నాయని పదేపదే నిరూపించుకుంటోంది. మరోవైపు, పాక్ నాయకత్వం మాత్రం వాస్తవాలను వక్రీకరిస్తూ.. తమ సైనిక వైఫల్యాలను దాచిపెట్టుకోవడానికి బోలు బెదిరింపులు, అబద్ధపు విజయ గాథలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో, భారత్ అనుసరిస్తున్న సంయమనం, స్పష్టత కలగలిసిన వ్యూహం చాలా ముఖ్యమైనది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగిస్తూనే, అంతర్జాతీయ సమాజంతో బాధ్యతాయుతమైన శక్తిగా తన ప్రతిష్టను కాపాడుకోవడం, రెండు లక్ష్యాలనూ భారత్ సమర్థంగా సాధిస్తోంది. దోవల్ చెప్పినట్టు, భారత్ సహనం బలహీనతకు చిహ్నం కాదు.. అది శక్తిపై ఉన్న విశ్వాసానికి, బాధ్యతాయుతమైన నాయకత్వానికి నిదర్శనం. ఇలాంటి స్పష్టమైన సందేశం, భవిష్యత్తులో సరిహద్దు ఆవలి నుంచి వచ్చే ఏ ముప్పునైనా ఎదుర్కోవడానికి భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రపంచానికి, ముఖ్యంగా పొరుగుదేశానికి గట్టి హెచ్చరికగా నిలుస్తుంది!!

## పనికొచ్చే పలుకు



## ప్రశ్నించడం.. ప్రాథమిక హక్కు!

"సైలెన్స్ ఈజ్ గోల్డెన్" అని ఎవరో చెప్పారు కదా -కానీ అన్యాయం జరుగుతున్నప్పుడు మౌనం మాత్రం గోల్డెన్ కాదు, కేవలం కంఫర్టబుల్ కావర్డీస్! ఈ విషయాన్ని అమెరికన్ సివిల్ రైట్స్ లీడర్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ ఏనాడో చెప్పాడు.. *Our lives begin to end the day we become silent about things that matter.* అంటే -మనకు నిజంగా మ్యాటర్ చేసే విషయాల్లో మనం సైలెంట్ అయిపోయిన రోజే, మన లైఫ్ ముగిసిపోవడం మొదలవుతుంది. హెవీ లైన్ కదా? కానీ ఇది వందశాతం రియల్.


ఇప్పుడు మనం బతుకుతున్న సోషల్ మీడియా వరల్డ్‌లో, "నాకెందుకులే గొడవ" అనే మెంటాలిటీ డెవలప్ అవుతోంది. ఇన్‌స్టాలో ఒక పోస్ట్ చూసి "సాడ్" రియాక్ట్ ఇచ్చి వదిలేయడం, గ్రూప్‌లో ఎవరో బుల్లీ చేస్తుంటే చూస్తూ ఊరుకోవడం, ఏదైనా అన్యాయం జరిగినప్పుడు "ఇది నా ప్రాబ్లమ్ కాదులే" అని స్క్రోల్ చేసుకుంటూ వెళ్లిపోవడం -ఇవన్నీ కూడా ఒక రకమైన సైలెన్స్. కానీ కింగ్ చెప్పిన పాయింట్ ఏంటంటే, ఈ సైలెన్స్ మనకు తెలియకుండానే మనల్ని కూడా ఆ అన్యాయంలో భాగస్వాములను చేస్తుందని. మీరు యాక్టివ్‌గా తప్పు చేయకపోయినా, చూస్తూ ఊరుకోవడం ద్వారా ఆ తప్పుకు సైలెంట్ సపోర్టర్‌గా మారిపోతారు.

మన కళ్ల ముందే దీనికి ఎగ్జాంపుల్ కూడా ఉంది. ఇటీవలే ఢిల్లీ జంతర్‌మంతర్‌లో జరిగిన ఆందోళన గుర్తుందా? నిరుద్యోగ యువతను కించపరుస్తూ ఒక వ్యాఖ్య వచ్చినప్పుడు, జెన్-జీ మౌనంగా లేదు. వీధుల్లోకి వచ్చింది. గొంతు వినిపించింది. లక్షలాది యువత లాఠీలు, బాష్పవాయువుకు భయపడకుండా నిలబడ్డారు. ఫలితం? ఒక కేంద్ర మంత్రినే రాజీనామా చేయించగలిగారు! ఇదే చెప్పేది -ఒక్క గొంతు ధైర్యంగా లేస్తే, అది వేలాది గొంతులకు స్ఫూర్తినిస్తుంది, అది సిస్టమ్‌నే కదిలించగలుగుతుంది. సైలెన్స్ మీ కంఫర్ట్ జోన్‌ను కాపాడుతుందేమో గానీ, అది ఎప్పుడూ మార్పును తీసుకురాదు.

ఇప్పుడు మీరు అనుకోవచ్చు -"నేను మార్టిన్ లూథర్ కింగ్ లాంటి బిగ్ లీడర్ కాదు కదా, నేనేం చేయగలను?" అని. కానీ మార్పు ఎప్పుడూ ఒక్క పెద్ద మూమెంట్‌తో మొదలవదు. చిన్న చిన్న యాక్ట్స్ ఆఫ్ కరేజ్‌తోనే మొదలవుతుంది. మీ ఫ్రెండ్ గ్రూప్‌లో ఎవరైనా రేసిస్ట్ జోక్ వేస్తే, "బ్రో అది కరెక్ట్ కాదు" అని చెప్పడం, కాలేజీలో ఎవరైనా బుల్లీ అవుతుంటే వాళ్లకు సపోర్ట్‌గా నిలబడటం, ఆఫీసులో అన్‌ఫెయిర్‌గా ఎవరినైనా ట్రీట్ చేస్తుంటే వాయిస్ రైజ్ చేయడం -ఇవన్నీ చిన్న చిన్న "ఐ హావ్ ఎ డ్రీమ్" మూమెంట్సే. కింగ్ కూడా మొదట్లో ఒక సాధారణ పాస్టర్ మాత్రమే, కానీ అన్యాయాన్ని చూసి మౌనంగా ఉండలేకపోయాడు, అదే ఆయనను చరిత్రలో నిలబెట్టింది.

సో, ఏదైనా తప్పు జరుగుతున్నప్పుడు "నాకెందుకు" అని సైలెంట్ కాకండి. మీ వాయిస్‌కి పవర్ ఉంది, అది మీకు తెలియకపోవచ్చు కానీ ఖచ్చితంగా ఉంది. అన్యాయం ముందు సైలెంట్‌గా ఉండటం అంటే, మీ నిజమైన సెల్ఫ్‌ను చంపుకోవడమే. బోల్డ్‌గా ఉండండి, వోకల్‌గా ఉండండి, ఎందుకంటే -సైలెన్స్ నెవర్ చేంజ్డ్ ఎనీథింగ్, బట్ వాయిస్‌లు ఖచ్చితంగా చేంజ్ తీసుకొస్తాయి.

# ఆంధ్రప్రదేశ్.. రేపటి రూపు!




ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక చిత్రపటంలో ఇప్పుడు కొత్త అధ్యాయం మొదలవుతోంది. సంప్రదాయ తయారీ, ఐటీ రంగాలకు మించి, ఏరోస్పేస్, గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్‌వంటి భవిష్యత్ సాంకేతికతల్లో రాష్ట్రం అడుగుపెడుతుండటం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతకు నిదర్శనం. ఆగస్టు 12న జరిగిన సిప్‌బి సమావేశంలో గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్, కృత్రిమ మేధ, డేటా సెంటర్ల వంటి ఉద్భవిస్తున్న రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని, ఈ భవిష్యత్ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించేందుకు అవసరమైన విధాన చర్యలను అధ్యయనం చేయాలని అధికారులను నాయుడు ఆదేశించడం విశేషం. ఇది కేవలం మాటలకే పరిమితం కాలేదు. ఇప్పటికే నెల్లూరు జిల్లా (శ్రీ సత్యసాయి జిల్లా)లో రేమండ్ గ్రూప్ అనుబంధ సంస్థ జేకే మైనీ గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్, రూ.510 కోట్లతో అత్యాధునిక ఏరోస్పేస్ తయారీ యూనిట్‌ను నెలకొల్పుతోంది. గ్లోబల్ ఓఈఎం సంస్థలకు, టైర్-1 సరఫరాదారులకు అవసరమైన అత్యంత కచ్చితత్వం గల విమాన ఇంజిన్ విడిభాగాలను ఇక్కడ తయారు చేయనున్నారు. 2027 మే నాటికి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కానుంది. 1,400 మందికిపైగా ప్రత్యక్ష ఉద్యోగాలు లభించనున్నాయి. అదే గ్రూప్‌నకు చెందిన మరో అనుబంధ సంస్థ గుడిపల్లిలో రూ.430 కోట్లతో ఆటోమోటివ్ విడిభాగాల యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఆపరేషన్ సిందూర్ విజయం తర్వాత ఏరోస్పేస్ రంగంలో వచ్చిన తొలి భారీ పెట్టుబడి ఇదే కావడం, బెంగళూరు సరిహద్దుకు ఆనుకుని ఉన్న హిందూపురం ప్రాంతాన్ని ఏరోస్పేస్ కారిడార్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి బలం చేకూరుస్తోంది. కొత్త ఏరోస్పేస్ పాలసీ కింద వచ్చిన తొలి పెట్టుబడి, భవిష్యత్తులో అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించే అవకాశాలకు తలుపులు తెరుస్తోంది.

గ్రీన్ అమ్మోనియా రంగంలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ప్రపంచస్థాయి గుర్తింపు సాధించింది. కాకినాడలో ఏఎం గ్రీన్ సంస్థ చేపడుతున్న 1.5 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం గల గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్దదిగా నిలవనుంది. మొత్తం రూ.84,000 కోట్ల పెట్టుబడితో, పాత నాగార్జున ఫెర్టిలైజర్స్ కాంప్లెక్స్‌ను పునరుద్ధరిస్తూ దీన్ని నిర్మిస్తున్నారు. 7.5 గిగావాట్ల సౌర, పవన విద్యుత్ సామర్థ్యం, 1,950 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ సామర్థ్యం, 2 గిగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజీతో సమీకృత క్లీన్ ఎనర్జీ వ్యవస్థగా దీన్ని రూపొందిస్తున్నారు. 2027నాటికి తొలి దశ, 2030 నాటికి పూర్తి సామర్థ్యం అందుబాటులోకి రానుండగా, ఇక్కడ ఉత్పత్తయ్యే గ్రీన్ అమ్మోనియా ప్రధానంగా జర్మనీకి ఎగుమతి కానుంది. ఇది ప్రపంచ క్లీన్ ఎనర్జీ సరఫరా వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రను మరింత బలోపేతం చేస్తుంది. ఇంతకుముందు రిన్యూ ఎనర్జీ సంస్థ రూ.82,000 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల పీవీ ఇంగాట్-వేఫర్ ప్లాంటు, 300 కేటీపీఏ గ్రీన్ అమ్మోనియా యూనిట్‌ను కూడా ప్రకటించడం గమనార్హం. లిథియం బ్యాటరీల రంగంలోనూ రాష్ట్రం ముందంజలో ఉంది. వారీ ఎనర్జీస్ సంస్థ అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.8,175 కోట్లతో దేశంలోనే అతిపెద్ద లిథియం-అయాన్ బ్యాటరీ గిగాఫ్యాక్టరీని నెలకొల్పనుంది. వార్షిక 16 గిగావాట్-గంటల సామర్థ్యంతో, సెల్ తయారీ నుంచి బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ వరకూ మొత్తం విలువ శృంఖలాన్ని ఇది కవర్ చేస్తుంది. 3,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. దీంతోపాటు, అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని ప్రవేశపెట్టి, ఐబీఎం, డీఆర్‌డీవో, బార్క్ వంటి సంస్థలతో కలిసి క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీ వ్యవస్థను నిర్మించే దిశగా అడుగులు వేస్తుండటం, ఏకకాలంలో అనేక భవిష్యత్ సాంకేతికతలపై రాష్ట్రం ఎంత విస్తృతంగా దృష్టి సారించిందో స్పష్టం చేస్తోంది.

అయితే, ఇంతటి ప్రతిష్టాత్మక లక్ష్యాలను సాధించే మార్గంలో సవాళ్లు కూడా తక్కువేమీ కాదు. ఏరోస్పేస్, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాలకు అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఈ నైపుణ్య అంతరాన్ని పూడ్చడం, స్థానిక యువతకు తగిన శిక్షణ ఇవ్వడం పెద్ద సవాలే. లిథియం బ్యాటరీ, గ్రీన్ అమ్మోనియా వంటి పరిశ్రమలకు భారీ మొత్తంలో నీరు, విద్యుత్ అవసరం కావడం, పర్యావరణపరమైన సమతుల్యతను కాపాడుకుంటూనే వీటిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కూడా ఉంది. అంతేకాక, ఇలాంటి అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలకు అవసరమైన ప్రత్యేక మౌలిక సదుపాయాలు -స్థిరమైన విద్యుత్ సరఫరా, ప్రత్యేక పారిశ్రామిక పార్కులు, పరిశోధన-అభివృద్ధి కేంద్రాలు.. ఇవన్నీ వేగంగా సిద్ధం చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు నాయుడు ప్రభుత్వం అనుసరిస్తున్న వేగం, స్పష్టమైన ప్రణాళిక అభినందనీయం. ప్రతి కొత్త రంగానికి ప్రత్యేక పాలసీని రూపొందించడం.. ఏరోస్పేస్ పాలసీ, క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ, ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ, ఐటీ అండ్ జీసీసీ పాలసీ 4.0 -ఇలా ప్రతి రంగానికి ప్రత్యేకంగా విధానపరమైన స్పష్టత ఇవ్వడం ద్వారా పెట్టుబడిదారులకు నమ్మకాన్ని కల్పిస్తున్నారు. విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దిన సంస్కరణలు, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలను ఆకర్షించడానికి పునాదిగా మారడం కూడా ఇందుకు నిదర్శనం. ప్రతి సవాలుకూ ముందుగానే పరిష్కారం ఆలోచించి, వేగంగా అమలు చేసే నాయుడు పరిపాలనా శైలి, ఈ భవిష్యత్ రంగాల్లో రాష్ట్రం విజయవంతం కావడానికి కీలక పాత్ర పోషిస్తోంది.

మొత్తంమీద చూస్తే, ఏరోస్పేస్, గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో ఏకకాలంలో పెట్టుబడులను ఆకర్షించగలగడం, ఆంధ్రప్రదేశ్‌ను కేవలం ఒక తయారీ కేంద్రంగా కాకుండా, భవిష్యత్ సాంకేతిక శక్తిగా తీర్చిదిద్దాలన్న నాయుడు దార్శనికతకు నిదర్శనం. సంప్రదాయ పరిశ్రమల మీదే ఆధారపడకుండా, రేపటి ప్రపంచానికి అవసరమైన సాంకేతికతలపై ఇప్పుడే పెట్టుబడి పెట్టడం అనేది దీర్ఘకాలిక ఆలోచనకు నిదర్శనం. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు, దేశంలోనే అతిపెద్ద లిథియం బ్యాటరీ గిగాఫ్యాక్టరీ, ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలి ఏరోస్పేస్ పెట్టుబడి -ఇవన్నీ ఏపీ ఖాతాలో చేరడం యాదృచ్ఛికం కాదు, ఇది స్పష్టమైన వ్యూహం, వేగవంతమైన అమలు ఫలితమే! సవాళ్లు ఎదురైనప్పుడు వెనుకడుగు వేయకుండా, ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీతో, స్పష్టమైన కాలవ్యవధితో ముందుకు సాగుతున్న నాయుడు నాయకత్వం, రాష్ట్రాన్ని నిజంగానే భవిష్యత్ సాంకేతిక కేంద్రంగా మార్చగలదన్న విశ్వాసాన్ని కలిగిస్తోంది. 2047నాటికి స్వర్ణాంధ్రగా ఎదగాలన్న లక్ష్యానికి, ఈ కొత్తతరం పరిశ్రమలు బలమైన పునాదిగా నిలవనున్నాయి. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి ఉద్యోగావకాశాలు, ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ గుర్తింపు రెండూ ఈ దార్శనిక వ్యూహం ద్వారా సాకారం కానున్నాయి. ∎




ఇతరుల మాటలు, అభిప్రాయాల ప్రకారం పిల్లలను తీర్చిదిద్దాలని చూస్తే, వారు పైకి పద్ధతిగా కనిపించొచ్చు. కానీ లోలోపల స్వేచ్ఛ లేమి వారిని మీ నుంచి దూరం చేస్తుంది. ప్రతి బంధువు సలహా, ప్రతి టీచర్ కామెంట్‌కు అనుగుణంగా పెంపకాన్ని మార్చుకుంటే, పిల్లల నిజమైన వ్యక్తిత్వం వికసించే అవకాశం కోల్పోతారు. మీ పిల్లల్ని మీరే బాగా అర్థం చేసుకోగలరు. కాబట్టి, ఇతరుల అభిప్రాయాలను వినండి, కానీ నిర్ణయాలు మాత్రం మీ సొంత అవగాహన, మీ పిల్లల అవసరాల ఆధారంగానే తీసుకోండి. మీ విధానాన్నే పిల్లలూ అలవాటు చేసుకుని తరాలనే మార్చగలుగుతారు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

## మూడేళ్ల మాయా పిల్లి!



న్యూజిలాండ్‌లోని ప్యూరురువా ద్వీపకల్పంలో అంతరించిపోతున్న 'పటేకె' (బ్రౌన్ టీల్) బాతులను రక్షించే ప్రాజెక్టుకు ఒక పిల్లి పీడకలగా మారింది. మూడేళ్ల క్రితం 20 అరుదైన బాతులను అడవిలోకి వదిలిన వారంలోనే ఒకటి చనిపోవడంతో, ఒక బూడిదరంగు పిల్లే కారణమని శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే, దాన్ని పట్టుకోవడం మాత్రం అసాధ్యంగా మారింది. అనూహ్యంగా ప్రవర్తిస్తూ, ఎప్పుడు ఎక్కడ కనిపిస్తుందో ఊహించలేని తీరుతో అది పరిశోధకులనుముప్పుతిప్పలు పెట్టింది. దీంతో దానికి 'నైన్ లైవ్స్' అని పేరుపెట్టారు. 2024లో మరో 20 బాతులను వదిలితే, వాటిలో 15టిని ఇదే వేటాడేసింది. మొత్తంగా మూడేళ్లలో డజన్ల కొద్దీ బాతులతోపాటు, కివీ పిల్లలు, స్థానిక బల్లులను కూడా చంపేసిందట. చివరికి వరుసగా మూడు రాత్రులు ఒకే ప్రదేశంలో కనిపించడంతో, సాల్మన్, ఫ్రైడ్ చికెన్, కుందేలు మాంసంతో ఎర వేసి బోనులో బంధించారు. అయితే, పట్టుకున్న

# హర్మన్‌ప్రీత్ డబుల్..

## ఆరంభ పోరులో వేల్స్‌ను చిత్తు చేసిన భారత్..!

ఎఫ్ఐహెచ్ పురుషుల హాకీ వరల్డ్‌కప్‌లో భారత జట్టు అదిరే బోణీ కొట్టింది. కొత్త జెర్సీ(కాషాయం రంగు)తో తొలిసారి మెగా టోర్నీలో ఆడుతున్న టీమిండియా శనివారం వేల్స్ జట్టును చిత్తుగా ఓడించింది. తొలి అర్థ భాగంలోనే రెండు గోల్స్‌తో స్పష్టమైన ఆధిపత్యం చెలాయించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఏకంగా రెండు గోల్స్ సాధించగా 3-1తో జయభేరి మోగించింది భారత్. ఆరంభం నుంచి గోల్ కోసం ముమ్మరంగా ప్రయత్నించిన వేల్స్ ఆఖరి నిమిషంలో సఫలమై పరువు కాపాడుకుంది. పురుషుల హాకీ ప్రపంచకప్‌ను భారత జట్టు విజయంతో ఆరంభించింది. గ్రూప్ డీ లీగ్ దశ తొలి మ్యాచ్‌లో వేల్స్‌పై సునీల్ తొలి గోల్ అందించాడు. పెనాల్టీ కార్నర్‌ను అతడు సూపర్‌గా డ్రాగ్ ఫ్లిక్ చేశాడు. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కూడా డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్ అందించగా తొలి అర్థ భాగంలోనే 2-0తో టీమిండియా స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్థ భాగంలోనూ వేల్స్ ఆటగాళ్లను సమర్థంగా నిలువరించారు భారత డిఫెండర్లు. పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ 43వ నిమిషంలో డ్రాగ్ ఫ్లిక్ ద్వారా బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. అంతే.. ఆధిక్యం 3-0కు చేరింది. బంతిపై పూర్తి నియంత్రణతో మన డిఫెండర్లు ప్రత్యర్థి ఆటగాళ్లను అడ్డుకున్నారు. అయితే.. 56వ నిమిషంలో సామ్ వేల్ష్ గోల్ చేయడంతో వేల్స్ ఖాతా తెరిచింది. అప్పటికే సమయం మించిపోవడంతో, హర్మన్‌ప్రీత్ సేన వేల్స్‌పై అలవోక విజయ సాధించింది. గ్రూప్ డీ నుంచి రెండు పాయింట్లు సొంతం చేసుకుంది.



### టెస్టుల్లో ట్రిపుల్ సెంచరీ..
### తొమ్మిదో ఆసీస్ బౌలర్‌గా హేజిల్‌వుడ్..!



్ట్రేలియా పురుషుల జట్టు చతుష్టయంలో ఒకడైన పేసర్ జోష్ హేజిల్‌వుడ్(జీశీంష్త్ర ఝఓశ్రీవఝశీశీ) మరో ఘనత సాధించాడు. టెస్టుల్లో మూడొందల వికెట్ల క్లబ్‌లో చేరాడీ స్పీడ్‌స్టర్. స్వదేశంలో డార్విన్ స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఈ మైలురాయిని అందుకున్నాడీ స్టార్ పేసర్. తద్వారా ఆసీస్ తరపున సుదీర్ఘ ఫార్మాట్‌లో 300లకు పైగా వికెట్లు తీసిన తొమ్మిదో బౌలర్‌గా చరిత్రకెక్కాడు హేజిల్‌వుడ్. గతకొంత కాలంగా టీ20లతో పాటు టెస్టుల్లోనూ నిలకడగా రాణిస్తున్న జోష్ హేజిల్‌వుడ్ వికెట్లతో రికార్డు నెలకొల్పాడు. డార్విన్ టెస్టులో బంగ్లాదేశ్‌పై ఆరు వికెట్లతో మెరిసిన అతడు.. మూడొందల క్లబ్‌లో చేరాడు. మొత్తంగా ఈ ఘనత సాధించిన తొమ్మిదో ఆస్ట్రేలియా బౌలర్‌గా అవతరించాడీ పేస్ గన్. ఈ తొమ్మిది మందిలో ఇద్దరే స్పిన్నర్లు ఉండడం విశేషం.
దివంగత షేన్ వార్న్ అగ్రస్థానంలో ఉండగా.. వెటరన్ బ్రెట్ లీ 310 వికెట్లతో హేజిల్‌వుడ్ కంటే ముందున్నాడు. ఇప్పటివరకూ 76 టెస్టులు ఆడిన హేజిల్‌వుడ్. 14 సార్లు ఐదు వికెట్లు తీశాడు. అతడి అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన..6/67.

1. షేన్ వార్న్ -- 708 వికెట్లు
2. నాథన్ లియాన్ -- 568 వికెట్లు
3. గ్లెన్ మెక్‌గ్రాత్ -- 563 వికెట్లు
4. మిచెల్ స్టార్క్ -- 435 వికెట్లు
5. డెన్నిస్ లిల్లీ -- 355 వికెట్లు
6. ప్యాట్ కమిన్స్ -- 316 వికెట్లు
7. మిచెల్ జాన్సన్ -- 313 వికెట్లు
8. బ్రెట్ లీ -- 310 వికెట్లు
9. హేజిల్‌వుడ్ -- 301 వికెట్లు

## స్పోర్ట్స్

### పడిక్కల్ శతకమోత..
### గాలే టెస్టులో తొలిరోజు టీమిండియాదే..!



గాలే టెస్టులో తొలిరోజే భారత జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. శ్రీలంక స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొన్న దేవ్‌దత్ పడిక్కల్(131 నాటౌట్) తొలి శతకంతో చెలరేగి భారీ స్కోరందించాడు. కేఎల్ రాహుల్(77 రిటైర్డ్ హర్ట్) అర్థ శతకంతో మెరవగా.. ఇద్దరూ 150 ప్లస్ భాగస్వామ్యం నెలకొల్పారు. టీ బ్రేక్ అనంతరం వర్షం అంతరాయం కలిగించినా.. రిషభ్ పంత్(27 నాటౌట్)తో పడిక్కల్ యాభై రన్స్ జోడించాడు. దాంతో, టీమిండియా 288/2తో సంతృప్తిగా తొలి రోజును ముగించింది. తొమ్మిదేళ్ల తర్వాత శ్రీలంకలో తొలి టెస్టు ఆడుతున్న భారత జట్టు అదరగొట్టింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆరొందల మ్యాచ్.. పైగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం రోజున దేవ్‌దత్ పడక్కల్(131 నాటౌట్) సెంచరీతో గర్జించాడు. లంకపై మంచి రికార్డున్న కేఎల్ రాహుల్‌తో(77 రిటైర్డ్ హర్ట్) సైతం అర్థ శతకంతో మెరిశాడు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(32) రనౌటయ్యాక లంచ్ సెషన్ ఆసాంతం క్రీజులో నిలిచిన రాహుల్ టీమిండియా స్కోర్ రెండొందలు దాటించాడు.

**టీ బ్రేక్ తర్వాత**

ఓపెనర్‌గా వచ్చి లంక బౌలర్ల సహనాన్ని పరీక్షించిన రాహుల్ టీ బ్రేక్ తర్వాత బ్యాటింగ్‌కు రాలేదు. కండరాల నొప్పితో విలవిలలాడిన అతడు రిటైర్డ్ హర్ట్‌గా క్రీజును వదిలాడు. దాంతో.. ఆ తర్వాత వచ్చిన శుభ్‌మన్ గిల్(16) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగాడు. ప్రభాత జయసూర్య ఓవర్లో గిల్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. వర్షం అంతరాయ కలిగించే సమయానికి శతక వీరుడు పడిక్కల్ జతగా రిషభ్ పంత్(27 నాటౌట్) నిలబడ్డాడు. అయితే.. వర్షం అంతరాయంతో 63 ఓవర్ పూర్తయ్యాక కాసేపు ఆటను నిలిపివేశారు అంపైర్లు. అప్పుడు టీమిండియా స్కోర్.. 239/2. వాన తగ్గాక పంత్ ఫోర్లు, సిక్సర్లతో అలరించాడు. దాంతో, తొలి రోజు ఆట ముగిసే సరికి రెండు వికెట్ల నష్టానికి భారత జట్టు 288 పరుగులు చేసింది.



శృతి హాసన్ సహజమైన గ్లామర్ అందరి దృష్టిని ఆకర్షించింది

## ‘మిర్జాపూర్ ది మూవీ’.. థియేటర్లలో
# గ్యాంగ్‌స్టర్ డ్రామా రీసౌండ్

ఓటీటీలో గొప్ప ఆదరణ పొందిన సిరీస్ ని థియేటర్లలో విడుదల చేయాలనే ఆలోచన సరైనదేనా? అంటే గతానుభవాలకు భిన్నంగా మిర్జాపూర్ గ్యాంగ్ స్టర్ డ్రామా విజయం సాధిస్తుందని అభిమానులు భావిస్తున్నారు. నిజానికి మిర్జాపూర్ అభిమానుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న -మిర్జాపూర్ ది మూవీ- ట్రైలర్ విడుదలవుతూనే సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఓటీటీ వేదికగా దేశవ్యాప్తంగా అపూర్వ ఆదరణ పొందిన ఈ సిరీస్ ఇప్పుడు మరింత వైలెంట్‌గా వెండితెరపైకి వస్తోంది. మిర్జాపూర్ సింహాసనం కోసం జరిగే అదే రక్తసిక్తం, పాత పాత్రలతో పాటు కొత్త శక్తుల రాకతో ఈసారి వెండితెరపై మరింత భారీగా స్ట్రైక్ అయ్యేలా కనిపిస్తోందని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి నటించిన కాలీన్ భయ్యా తన శాంత స్వభావాన్ని కాపాడుకుంటూనే.. అవసరమైనప్పుడు ఎంత క్రూరంగా మారగలడో మరోసారి చూపించబోతున్నారు. ఇక అభిమానుల అభిమాన పాత్ర మున్నా భయ్యా (దివ్యేందు) అదే మాస్ ఎనర్జీతో.. తన ముందర ఎవరైనా ఎదిరిస్తే బూతులతో విరుచుకుపడే వైఖరితో రీ-ఎంట్రీ ఇచ్చాడు. ట్రైలర్‌లో రాజకీయనాయకుడితో సాగే సన్నివేశం మున్నా మార్క్ క్యారెక్టరైజేషన్‌కు అద్దం పడుతోంది. వీరితో పాటు గుడ్డు, బాబ్లూల ప్రయాణం మొదటి నుండి సరికొత్తగా ఆవిష్కరించబడబోతోంది. అంతేకాకుండా, గొంతులు కోసే కంపౌండర్ పాత్ర కూడా ఈసారి మళ్లీ థియేటర్లలో రచ్చ చేయనుంది. అయితే ఈ ట్రైలర్‌లో అందరి దృష్టినీ ఆకర్షించి ప్రత్యేకంగా నిలిచింది మాత్రం రవికిషన్ పాత్రే! ఈ బలమైన గ్యాంగ్‌స్టర్ డ్రామాకు రవికిషన్ చేరిక ఒక ప్రధాన బలంగా మారింది. స్క్రీన్‌పై విలనిజంతో భయపెడుతూనే.. తన నవ్వు పూయించే డైలాగ్ టైమింగ్‌తో ప్రేక్షకులను మెప్పించడానికి ఆయన సిద్ధమయ్యారు. సిరీస్‌లోని హింస, రా రకమైన కంటెంట్‌ను సినిమాల్లో ఎక్కడా తగ్గించకుండా మేకర్స్ అలాగే కొనసాగించడంతో షో ప్రియులకు బిగ్ స్క్రీన్‌పై సంపూర్ణ వినోదం లభించడం ఖాయంగా కనిపిస్తోంది.భారీ తారలు లేకపోవడంతో ఈ చిత్రాన్ని పరిమిత బడ్జెట్‌తోనే రూపొందించినప్పటికీ, సిరీస్‌కు ఉన్న విపరీతమైన క్రేజ్ దృష్ట్యా మొదటి రోజు భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే గతంలో ఓటీటీ సిరీస్‌లు సినిమాలుగా మారినప్పుడు బాక్సాఫీస్ వద్ద ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ అడాప్టేషన్ ఎంతవరకు హిట్ కొడుతుందనే దానిపై విశ్లేషకులు జాగ్రత్తగా అంచనాలు వేస్తున్నారు. ఏది ఏమైనా సెప్టెంబర్ 4న థియేటర్ల వద్ద అభిమానుల కోలాహలం ఏ స్థాయిలో ఉంటుందో చూడాలి.




### ఫ్యాన్స్ రెస్పాన్స్ ఇలా ఉంది: సోషల్ మీడియాలో హంగామా!

‘మిర్జాపూర్ ది మూవీ’ అఫీషియల్ హిందీ ట్రైలర్ యూట్యూబ్‌లో విడుదలైన క్షణం నుంచే రికార్డు స్థాయి వ్యూస్, కామెంట్లతో సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ముఖ్యంగా ‘మున్నా భయ్యా’ (దివ్యేందు) పునరాగమనం పై అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన కమ్‌బ్యాక్ కోసమే ఈ సినిమా తీసినట్లుందని కామెంట్స్ చేస్తున్నారు. అలాగే -దేఖ్ రహా హై బినోద్.. సచివ్ జీ ఎలా గుండాగిరీ లైన్‌లోకి వచ్చారో!- అంటూ -పంచాయత్- సిరీస్ రిఫరెన్స్‌లతో మీమర్స్ చేస్తున్న కామెంట్లు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.ఈ ట్రైలర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రవికిషన్ పాత్రపై కూడా వీక్షకులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ భయాన్ని గొలుపుతూనే వినోదాన్ని అందిస్తుందని, ‘పార్ట్ టైమ్ పొలిటీషియన్ - ఫుల్ టైమ్ యాక్టర్’ అని నెటిజన్లు అభివర్ణిస్తున్నారు. పంకజ్ త్రిపాఠి-కాలీన్ భయ్యా- గాంభీర్యం, మున్నా భయ్యా మాస్ ఎనర్జీ, రవికిషన్ నటన మేళవింపుతో వచ్చిన ఈ ట్రైలర్ దూసుకెళుతోంది.



వెండి అలంకరణలతో కూడిన దుస్తుల్లో శర్వరీ మెరుపులు - ఆకర్షణీయమైన హుందాతనంతో అలరించిన వైనం

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com